

భక్తులు

జీవిత చరిత్ర

భక్త మందారం





సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 6020010032181

గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం **ఉచితంగా eBook** రూపంలో భారత ప్రభుత్వపు సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు, కనుక వారిని సంప్రదించగలరని మనవి చేసుకొంటున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

భక్తమందారము

ఇయ్యది

రాజమహేంద్రవరమునందలి మ్యునిసిపల్

హైస్కూలునందు సహాయాంధ్రోపాధ్యాయుండగు

బాలదారి వీరనారాయణదేవుగారిచే

రచియింపబడియె.

మూడవకూర్పు

రాజమహేంద్రవరము

సరస్వతీ పవర్ ప్రెస్‌నందు ముద్రితము

1934

[వెల 0—10—0

విషయసూచిక

వి జ్ఞా ప న ము

ఆర్యమహాశయులారా!

భరతవర్షమునఁ బ్రాచీనమధురభాషలగు సంస్కృతాంధ్రములు రాజావలంబనము సన్నగిల్లిననాఁటఁగోలె నిస్సారబీజములై యాంధ్రభూమిని మొలకలెత్తి విజృంభింపకుండుట భాషాకృషి యొనరించు కవికర్షకులకు స్వానుభవవిషయము. నిరంతరము తాళీదళసంపుటప్రకరకాంతారవీథులఁ గ్రుమ్మరుచు జీవితమంతయు భాషాభగవతిసేవకే యర్పించిన పండితప్రకాండులు మూడుపదులయాకలతో ముప్పూను గడవఁబెట్టుకొనుచు నామమాత్రావశిష్టులై నడయాడుచున్న సంగతియు బ్రాజ్ఞులెఱుంగనిది కాదు. దానంజేసి పండితజనాదరణము ప్రభుకోటిహస్తములనుండి ప్రజాసామాన్యముచేతఁ బడినది. కాలక్రమమున దేశకాలపరిస్థితులతోఁ బాటు భాషాపటుత్వమును సడలిన కారణముననేమి, ఆధునిక యువజనాళికిఁ గావ్యనాటకాలంకారపరిచితి గగనకుసుమమగుటనేమి, యుద్గ్రంథముల కాదరణము శశవిషాణప్రాయమైనది. విద్యార్థికోటికి పాటవము లేని బూటకపుహొత్తముల మొత్తములే చిత్తముల కాదర్శములగు నుత్తమగ్రంథములైనవి. పండితులకు గండపెండెరములు, బంగారుపల్యంకులు, అగ్రహారములు స్వప్నగతభాగ్యములైనవి. దైవోపహతులగు పెక్కండ్రు గ్రంథ

మానదు. అయిన నేమి? ప్రాచీనకవీంద్రులహృదయగహ్వర
ములనుండి యవిచ్ఛిన్నముగఁ బ్రవహించుచు వచ్చిన భాషా
స్రవంతినిం బడి యథేచ్ఛముగ నీఁదులాడుటంజేసియో, తచ్ఛీ
కరబృందము హత్తుకొన మెత్తవడిన చిత్తవృత్తిని మరలింపఁ
జాలమినో, యిందు బెద్దలసుద్దులనే యెద్దికమీఱ నుద్దీపింపఁ
జేయఁగలిగితి. రెండియుఁ జిరకాలముననుండి లేఁబ్రాయంపుఁ
గుజ్జులవిచిత్రభావములతోను వింతపాండితితోను నిరంతరము
పరిచయము గలిగిన మాతృభాషాబోధకుఁడ నగుటంబట్టియుఁ
బెక్కు తెలుఁగు లగు పఠనీయగ్రంథములను బోధించిన స్వాను
భవమునుబట్టియు నున్నతపాఠశాలయందలి పైతరగతుల
తరుణవయస్కుల కిట్టిగ్రంథములే పఠనార్హము లని తోఁచిన
కతంబున నివ్విధమగు గ్రంథరచనకుఁ బూనుకొంటి. మఱియు
నీనడుమ స్కూలుఫైనలువిద్యార్థులకు సహాయపరీక్షాధికారిగ
నుండుట సంభవించుటచే వివిధప్రాంతములయందలి బాలకుల
భాషాజ్ఞానమునకుఁ బరిచితుఁడ నైనవెనుక నామొదటియభి
ప్రాయము మఱింత బలపడినది. నవీనభాషాయుగమునందలి
విద్యార్థులు మాతృభాషాస్వరూపమును గుర్తెఱుంగఁజాలక
పరభాషాపటుత్వము నలవఱచుకొననేరక ప్రాలుమాలికతో
రెండింటికిని జెడిన రేవణులై మానసక్షేత్రములు బీడువడ
గోడు గుడుచుచున్నారు. వీరిలోఁ గొందఱు భారతీయుల
కేడుగడ యనఁదగిన ప్రామాణ్యగ్రంథరాజముల స్వరూపము
నైన నెఱుంగరు. మధురవాఙ్మయసౌధవీధిని జేరుటకు కావ్య

నాటకాలంకారకనాటములను దెఱచి విద్యార్థిలోకమునకు స్వాగతమిచ్చి యస్తంగతులయిన కవిసమ్రాట్టుల పవిత్రనామము లైన నెఱుంగరు. రామచంద్రా! న్యాయనైతి కాదు కాని సీతారాములపరస్పరసంబంధము నైన నెఱుంగ రనుటలో నతిశయోక్తి లేదు. భాషాజ్ఞానము పూజ్యము. కావున విద్యార్థి దశయందు భాషాజ్ఞానమును గూలంకషముగ నలవఱచు కొనుట కనువగు నుత్తమగ్రంథములనే బాలకు లధ్యయనము సేయుట శ్రేయోదాయకము. మఱియు సుప్రసిద్ధచరిత్రాత్మకు లయిన వీరపూరుషుల పవిత్రజీవితములకుఁ బురాణయుగము నాఁటి మహాత్ముల కథాసంవిధానములే యాదర్శము లని యను భవజ్ఞు లగు విజ్ఞులు తలంపక మానరు. కావుననే దైవభక్తికిని నాత్మగౌరవమునకును మూలకందమై మధురకవితాలహరిం బడి లోకతృష్ణను శాంతింపఁజేసిన కవిసార్వభౌముఁడగు బమ్మెర పోతనామాత్యునిచే విరచిత మగు మహాభాగవతమందలి భక్తుల ధార్మికజీవితములతో విద్యార్థుల భావిజీవితములను బ్రోది సేయుటకై యత్నించినాఁడ. భాషయు భావములును జాలమట్టున కందుండియే పొందుపఱుపఁబడినవి. కావునఁ బాలకుల శ్రేయోభివృద్ధులను గాంక్షించు నాయీప్రయత్నమునకు విద్యాశాఖాధికారులును, స్థానిక పాలనాధికారులును ముఖ్యముగఁ దోడి దేశభాషాపండితులును దోడ్పడిననే గాని యయ్యది ఫలియింపనేరదు. మఱియు నిక్కాలమున దేశ భాషలు తలలెత్తి స్వేచ్ఛాప్రచారము గావింపవలయు నన్న,

తద్భాషాపండితులు తమ పాండిత్యప్రకర్షమునకుఁ దగిన సత్కారముల నందవలయు నన్న, నందులకుఁ బ్రజాదరణముతోఁ బాటు ప్రభుత్వానుభూతియు నుండవలయును గదా! గ్రంథరచనావిధానమందలి నెరసుల నరసి యీసడింపక దోసములం దెల్పి నాచే సవరింపఁజేయుటకై సరససాహిత్యచక్రవర్తులకుఁ బ్రణతు లొనరించుచున్నాఁడ. ప్రేమభరంబున గ్రంథసంస్కరణమునకై సర్వవిధములఁ దోడ్పడిన బ్రహ్మశ్రీ జనమంచి వేంకటరామసుధీమణికిని నాళము కృష్ణరాయకవి మిత్రునకును హృదయపూర్వకాభివందనము లర్పించుచు వారల కప్పరమేశ్వరుం డితోధికౌన్నత్యములఁ బ్రసాదించుఁ గాక యని వేఁడుచున్నాఁడ.

ఇట్లు
విబుధజనవిధేయుఁడు
బాలదారి వీరనారాయణదేవు

భక్తమందారము

ప్రహ్లాదుఁడు

శ్రీమదాంధ్ర భాగవతనిర్మాణచాతురీధురీణుఁ డగు బమ్మెర పోతనామాత్యుని భక్తిసముద్రమునుండి కవితాభావ తరంగవిజృంభణము కతంబున బయల్వెడలిన దివ్యతేజోమణియై దైత్యాలవీసంజాత హరిచందనమై సత్పురుషలోకమూర్ధాభిషిక్తుఁడై యాసేతుశీతనగవాస్తవ్యులహృద్వీథులనిండి వెలుఁగొందు భక్తజనశేఖరుఁడు ప్రహ్లాదుఁడు. దానవకుల శిరోమణి యగు హిరణ్యకశిపునకు సుగుణాలలామయు సాధ్వీమతల్లియు నగు లీలావతియందు జనియించిన పుత్రరత్నము. ముముక్షువుల పాదపూజ లందుచు ముల్లోకముల సంచరించు పరమభాగవతోత్తముఁడు మునికుల సార్వభౌముఁడు నగు నారదమునీంద్రుని ప్రియశిష్యుఁడు. చరాచరజంతువర్గమునందును దనయందును సమహితత్వమును గాంక్షించువాఁడు. పెద్దలఁ గాంచి సేవకునిలీలఁ దద్దయు వినతు లొనరించువాఁడు. అన్యకాంతామతల్లుల నవలోకించినంతనే మాతృభావన చేసి మన్నించువాఁడు. దీనజనప్రకరమును గాంచి ధర్మవాత్సల్యమున జననీజనకుల చాడ్పునఁ బోషింపఁ దలపోయువాఁడు. సఖులయెడ గురుజనంబులయెడ సోదరభావమును దైవతభావ

మును జూపుచు హాస్యలీలావిలాసముల నైన బొంకి యెఱుఁగని నిష్కలంక ప్రభావిభాసితుఁడు. మఱియు నాకారజ న్మవిద్యార్థ వరీయుండైనను గర్వసంగతుఁడు కాఁడు. వివిధమహానేకవిషయ సంపన్నుఁడైనను బంచేంద్రియములకు లోఁబడనివాఁడు. భవ్య వయోబలప్రాభవసమన్వితుఁడైనను కామరోషాదులఁ గ్రందు కొనఁడు. కామినీప్రముఖభోగములఁ దులతూఁగుచున్నను వ్యసనసంసక్తిలేని ధీరుఁడు. ఇట్టి చిత్రచరిత్రములతోఁ గూడిన యీభక్తజనపారిజాతుని కథాసంవిధానము భారతసంతాన మునకు మార్గదర్శకమై పరిఢవిల్లుఁ గాక!

ప్రహ్లాదుని పినతండ్రి యగు హిరణ్యాక్షుని మరణము నకుఁ గారణభూతుఁడగు శ్రీమహావిష్ణువును సాధింప నము కట్టి తండ్రి హిరణ్యకశిపుఁడు తపం బొనర్ప మందరాచలము నకుఁ బోయె. తల్లి యింద్రునిచేఁ జెఱపట్టఁబడి దేవమౌని కటాక్షవీక్షణమున విడివడి నాథురాకను మదిలో వాంఛిం చుచు మనోవాక్కాయముల దోషరహితయై మౌనిశుశ్రూ షలు సేయుచు కాలము గడపుచుండె. అత్తఱి జగదుద్ధారక మగు తారకమంత్రరాజమును గర్భకుహరముననే యభ్యసించి భూమి కవతరించిన మహాభాగుఁ డీ ప్రహ్లాదుఁడు.

తపోలబ్ధికై మందరాద్రి కరిగిన దైత్యరాజు పద్మ గర్భునిఁగూర్చి యుగ్రతపము చేయ నారంభించె. ఆతని తపః ప్రభావానలజ్వాలలకుఁ దాళఁజాలక సురగణము లెల్లఁ గమ లాసను నాశ్రయించి తద్వృత్తాంతమును విన్నవించుకొనిరి.

అంముల కానలు మొగంబుల వేల్పు సపరివారముగ దానవ భర్తకుఁ బ్రత్యక్షమై యభీప్సితముల ననుగ్రహించె. హంస వాహనుని యనుగ్రహంబు కతంబున నమోఘువరంబుల నంది దితినందనుఁడు గర్వాతిరేకమున గంధర్వయూథమును గజిబిజి యొనర్చె. సురల నసురుసురు గావించె. యక్షకిన్నర కింపురుషుల బలిమిమై బాధింపఁ జొచ్చె. యాగము లొనరించు భూభాగములకుఁ జేరి హవిర్భాగములఁ దానె స్వీకరింప మొదలిడె. తుదకు సునాసీరునిఁ బదభ్రష్టుని గావించి సుధర్మాముఖ్య పీఠము నాక్రమించె. ఇట్లు దిగ్విజయమును జేకొని యాతఁడు పుత్రసందర్శనోత్సాహము రెట్టింప స్వగృహాభిముఖుఁ డయ్యె.

బంగరుపానుపునఁ బవ్వళించి కేశవనామసంస్మరణ మొనరించు తనూజాతు నుపలక్షించి దనుజాధినాథుఁ డాగ్రహావ్యగ్రుఁడై కర ముద్దీపించె. శత్రునామసంకీర్తనము చేయు బాలకునిఁ జక్కఁజేయ సర్వవిధములఁ బ్రయత్నించి విఫల మనోరథుఁడయ్యె. కన్నకుమారుని గరువతనమునకు హృదయ మెఱియసాగె. "అక్కటా! శత్రుదుర్నిరీక్ష్యప్రతాపుండ నగు నా సన్నిధానమున, నరాతిమత్తేభకుంభస్థలవిదారణాంకుశమగు నా కరవాలముముందర, నెంతటి యద్భుతచరిత్రము లుద్భవించిన" వని వితర్కింప మొదలిడె. ఇట్లు పెద్దయుంబ్రొద్దు చింతించి, కానిమ్ము చూచెదం గాక యని కుమారునిఁ జేరఁ జీరి సాంత్వనవచనముల "వత్సా! ఐహికాముష్మికసుఖంబులకు విద్యయే దివ్యసాధనము. చదువనివాఁ డజ్ఞుం డగు.

సకలసద్వివేకచతురుండవై విరాజిల్లుటకు విద్యానిధివి గమ్ము. నైశంబ గురుకులవాసముగావింపు" మని హెచ్చరించి ప్రచండవితర్కులగు చండామర్కుల రావించి వారలం గాంచి యివ్విధంబున వాక్రుచ్చె. "సుధీవరులారా! వీఁడె నా కుమారుఁడు. విద్యాగంధశూన్యుఁడై యంధప్రక్రియ నున్నవాఁడు. మదీయప్రతాపోజ్జ్వలజ్వాలనం బించుకయేని యెఱుంగఁడు. వీనిని గారుణ్యామృతచిత్తమున గ్రంథపరిచితునిఁ గావించి నీతివిశారదునిఁగా దిద్దుఁడు. మీరు మాకు గురువులు, పెద్దలు, ఆత్మబంధువులు, కారుణ్యచిత్తులు. వీనిని శిక్షించి రక్షింప మీరె సమర్థులు. వేయేల? మీదె భారము" ఇట్లు వచియించి కుమారుని వారి కొప్పగించెను.

చరాచరభూతవర్గమున నాత్మసారూప్యము గాంచువానిని, దీనవత్సలుని, పరకాంతాపరాఙ్ముఖుని, పంచేంద్రియాతీతుని, కామరోషవివర్జితుని, సుగుణగణవిరాజితుని, ప్రహ్లాదుని వెంట నిడుకొని గురువులు స్వగృహాభిముఖులైరి. పిమ్మట తరుణవయస్కు లగు నసురకుమారుల సహపాఠకులఁ జేసి పాఠయోగ్యము లగు శాస్త్రరాజములఁ బఠింపింప సాగిరి. పంచాబ్దంబులవాఁ డగు నబ్బాలుఁడు గుర్వవిధేయుఁడు గాక చెప్పినదెల్ల మచ్చికమీఱ గ్రహించుచు సూక్ష్మబుద్ధియై మెలంగసాగె. కాని విశేషశేముషీ ప్రభావసంపన్నుం డగుటచే గురుప్రబోధము మిథ్యాస్వరూప మని గ్రహించి నిరంతరము శ్రీమన్నారాయణచరణసేవాధురీణుఁడగుచు మెలఁగుచుండె.

కతిపయదినములు గడచుదనుక నిరీక్షించి దనుజాధి నాథుఁ డొక్కదివసమునఁ గుమారవిద్యాపరిశ్రాంతిని దిలకింపఁ గోరి యబ్బాలకుని జీరఁ బనిచె. కేశవచింతనామృత రసంబు నాస్వాదించుచుఁ గాలక్షేపము చేయు నక్కుమార వరుండు పితృశాసనము పాలించుచు దానవభర్తను సమీపించె. ఇట్లరుదెంచిన పుత్రరత్నముం గాంచి తండ్రి మించిన ప్రేమానుబంధమునఁ గౌఁగిలించి దీవించి నేమ మారసి యంక పీఠమున నధివసింపఁజేసె. మఱియుఁ బుత్రగాత్రపరిష్వంగమున రోమాంచితగాత్రుఁడై "వత్సా! నీహృద్వీథిని భద్రంబగు విషయం బెయ్యది ముద్దు లొలుకఁ బలుకవే" యని వాక్రుచ్చె. అందుల కాయర్భకుఁడు నిర్భరానందసంభరితుఁడై "నిశాచరాగ్రణీ! మతిభ్రమణంబున సంసారాంధువునఁ బరిభ్రమింపక 'మీరు మే' మను భిన్నత్వమును వీడి దివ్యకళాధాముండగు విష్ణుదేవుని శరణంబు సొచ్చుటయే మే" లని వచించె. ఇట్లు వచియించు ప్రహ్లాదుని గాంచి "తండ్రీ! నీవర్తనము గడుఁ జిత్రముగఁ దోఁచుచున్నది. దానవశ్రేణికిఁ గృతాపరాధుఁడగు వైరివీరుని గొనియాడుట భావ్యమే? వత్సా! సురాధినాథుల స్రుక్కించుటయో, యక్షకిన్నర గంధర్వనాగపతుల నుక్కడంచుటయో, కావించి వంశపావనుఁడవుగమ్ము. హరి యని గిరి యని వదరుచు వృథాకాలక్షేపము గావించి మోహాంధుఁడవై నశియింపకు" మని నిలింపవైరి మందలించె. హరిభక్తివిదూరుం డగు తండ్రిమాటలు విని

పురోహితుని దిక్కు మొగంబై ప్రహ్లాదుఁ డిక్కరణిం జెప్ప దొరకొనె. "బ్రాహ్మణోత్తమా! ఆయసము నయస్కాంతము వలె నాచిత్తమును హృషీకేశుపాదారవిందయుగళి సమాకర్షించుచున్నది. కొంద ఱజ్ఞులు వ్యక్తభేదము గల్పించుకొని జిజ్ఞాసాపథమున మూఢులై పరంధాముని దర్శింపనేరరు. నిర్మలమై గంభీరమై మధురసుధారససంభరిత మగు దివ్యతేజోవికాసమున వెలుఁగొందు చిద్రూపుని గళ్యాణసాగరుని గాంచి తనివినొందిన డెందము బక్కదైవముల నాశ్రయించి తృప్తిఁ జెంద నేర్చునే?" ఇవ్విధంబున ముచ్చటించు దైత్యార్భకుని గాంచి సురారాతి రోషకషాయితాత్ముఁడై విజృంభింపఁ దొడఁగె. భీకరమూర్తి యగు నాతనిని శాంతుం జేసి గురువులు వెండియు నుద్దండముగ దండించి యీతని జక్కఁ జేయుదు మని చెప్పి బాలకుని దోడ్కొనిపోయిరి.

అనంతరము వా రా రాక్షసరాజనందనుని సామదానభేదదండములఁ జక్కంబఱిచి త్రివర్గపారవిధానము నేమరకుండు మని పలుమాఱు హెచ్చరించుచు దానవేశ్వరుని సన్నిధానమునకుఁ గ్రమ్మఱఁ దోకొనిపోయి "రాజా! నీతిపారగుఁడైన కుమారకుని విద్యాప్రాభవమును బరీక్షింపవే" యని మనవి యొనర్చుకొనిరి. హరిహరాదుల కందఁగారాని భక్తిప్రాభవమునఁ జెన్నారువాని, మాధవానుచింతనమున మేను మఱచువాని, సర్వప్రపంచము శ్రీవిష్ణుమయ మని భావించువాని, కారుణ్యవివేకాదిలక్షణములు మూర్తిభవించిన ట్లమరువాని,

పురోహితుని దిక్కు మొగంబై ప్రహ్లాదుఁ డిక్కారణిం జెప్ప దొడఁగొనె. "బ్రాహ్మణోత్తమా! ఆయసము నయస్కాంతము వలె నాచిత్తమును హృషీకేశుపాదారవిందయుగళి సమాకర్షించుచున్నది. కొంద ఱజ్ఞులు వ్యక్తభేదము గల్పించుకొని జిజ్ఞాసాపథమున మూఢులై పరంధాముని దర్శింపనేరరు. నిర్మలమై గంభీరమై మధురసుధారససంభరితమగు దివ్యతేజోవికాసమున వెలుఁగొందు చిద్రూపుని గళ్యాణసాగరుని గాంచి తనివినొందిన డెందము బక్కదైవముల నాశ్రయించి తృప్తిఁ జెంద నేర్చునే?" ఇవ్విధంబున ముచ్చటించు దైత్యార్భకుని గాంచి సురారాతి రోషకషాయితాత్ముఁడై విజృంభింపఁ దొడఁగె. భీకరమూర్తి యగు నాతనిని శాంతుం జేసి గురువులు వెండియు నుద్దండముగ దండించి యీతని జక్కఁ జేయుదు మని చెప్పి బాలకుని దోడ్కొనిపోయిరి.

అనంతరము వారా రాక్షసరాజనందనుని సామదానభేదదండములఁ జక్కంబఱిచి త్రివర్గపాఠవిధానము నేమరకుండు మని పలుమాఱు హెచ్చరించుచు దానవేశ్వరుని సన్నిధానమునకుఁ గ్రమ్మఱఁ దోడ్కొనిపోయి "రాజా! నీతిపారగుఁడైన కుమారకుని విద్యాప్రాభవమును బరీక్షింపవే" యని మనవి యొనర్చుకొనిరి. హరిహరాదుల కందఁగారాని భక్తిప్రాభవమునఁ జెన్నారువాని, మాధవానుచింతనమున మేను మఱచువాని, సర్వప్రపంచము శ్రీవిష్ణుమయ మని భావించువాని, కారుణ్యవివేకాదిలక్షణములు మూర్తీభవించిన ట్లమరువాని,

విష్ణుసేవామృతమత్తచిత్తమున వర్తించి తరియింపు" మని మిన్నకుండె. బాపురే! బాలకుని హృదయఫలక మెంత పరిశుద్ధముగఁ బ్రకాశించుచున్నది! వాక్కు లెంతకోమలములు! భావ మెంత గంభీరము!

అంత నాసురాంతకవైరి దుర్దాంతక్రోధఘూర్ణమాన మానసుఁడై కంపింపఁ దొడఁగె. చిత్తము త్తలపాటున స్వాయత్తముగా నుండె. ఇందులకు గురువుల యవివేకమే కారణమని మండిపడుచుండె. బాలకునికి దుర్నీతులు గఱపి కొంపకుఁ జిచ్చుపెట్టినవారు గురుబ్రువు లని నిందింపఁ బూనె. ప్రహ్లాదుఁడు పుత్త్రాకారమున దేహమున వ్యాపించిన మహావ్యాధి యని తలంచి పలవింపఁ దొడంగె. తుదకు వంశనాశనహేతుభూతమగు నీబాలభూతమును మననీయరా దని కృతనిశ్చయుఁడై సేనానిని బిలిచి "ఓరీ! వీనిని సత్వరముగఁ దోడ్కొని పోయి బాలుఁ డనక, రాచబిడ్డఁ డనక, కృపాసింధుఁ డనక, లోకమాన్యసంశీలుఁ డనక, నిరపరాధి యనక భిండివాల ముద్గర గదాభీలఘాతములచే నొప్పించి తుత్తునియలుగ మేను ఖండించి మడియఁ జేయు" మని యాన తిచ్చె.

అక్కటకటా! బాలుని, హరిభక్తిప్రభావిశాలుని, సుగుణాలవాలుని, సుందరాకారుని, లోకపవిత్రచారిత్రుని సంహరింప జనకుఁడే కృతనిశ్చయుఁ డయ్యె! భళిరే! రాజస తామసాహంకారముల దుర్వృత్తి! దురహంకారదుర్విదగ్ధహృదయుఁ డగు రాక్షసకులపాంసనునకు హరిభక్తితత్పరుఁ

విష్ణుసేవామృతమ త్తచిత్తమున వర్తించి తరియింపు" మని మిన్నకుండె. బాపురే! బాలకుని హృదయఫలక మెంత పరిశుద్ధముగఁ బ్రకాశించుచున్నది! వాక్కు లెంతకోమలములు! భావ మెంత గంభీరము!

అంత నాసురాంతకవైరి దుర్దాంతక్రోధఘూర్ణమాన మానసుఁడై కంపింపఁ దొడఁగె. చిత్తము త్తలపాటున స్వాయత్తముగా నుండె. ఇందులకు గురువుల యవివేకమే కారణమని మండిపడుచుండె. బాలకునికి దుర్నీతులు గఱపి కొంపకుఁ జిచ్చువెట్టినవారు గురుబ్రువు లని నిందింపఁ బూనె. ప్రహ్లాదుఁడు పుత్త్రాకారమున దేహమున వ్యాపించిన మహావ్యాధి యని తలంచి పలవింపఁ దొడంగె. తుదకు వంశనాశనహేతుభూతమగు నీబాలభూతమును మననీయరా దని కృతనిశ్చయుఁడై సేనానిని బిలిచి "ఓరీ! వీనిని సత్వరముగఁ దోడ్కొని పోయి బాలుఁ డనక, రాచబిడ్డఁ డనక, కృపాసింధుఁ డనక, లోకమాన్యసంశీలుఁ డనక, నిరపరాధి యనక భిండివాల ముద్గర గదాభీలఘాతములచే నొప్పించి తుత్తునియలుగ మేను ఖండించి మడియఁ జేయు" మని యాన తిచ్చె.

అక్కటకటా! బాలుని, హరిభక్తిప్రభాపిశాలుని, సుగుణాలవాలుని, సుందరాకారుని, లోకపవిత్రచారిత్రుని సంహరింప జనకుఁడే కృతనిశ్చయుఁ డయ్యె! భళిరే! రాజస తామసాహంకారముల దుర్వృత్తి! దురహంకారదుర్విదగ్ధ హృదయుఁ డగు రాక్షసకులపాంసనునకు హరిభక్తితత్పరుఁ

హోమహాపన్న శరణ్య!' యని హరినామసంకీర్తన మొనరిం చుచునే కాని క్లేశమున కోహటించఁడు. అట్టి పరమభక్తుని దివ్య ప్రభావమునకు వెఱఁగంది దనుజేశ్వరుఁడు వానికి ధర్మార్థ కామము లుపదేశింపుఁడని గురుకుమారుల కానతిచ్చి పంచె. వారును మహాప్రసాద మని వానిం గొనిపోయి శక్తివంచనము సేయక బోధింపసాగిరి.

జ్ఞానసింధు వగు నబ్బాలుఁడు గురూపదిష్టశాస్త్రముల యందు భ్రమఁ జెందక యతీతుఁడై సతీర్థబృందమునకుఁ బరమభాగవతధర్మము లుపదేశించి వారల నెల్ల నారాయణ చరణారవింద సేవాపరాయణులఁ గావింప నుద్యోగించుచుండె. అబ్బాలకుని యపారవిజ్ఞానమునకుఁ దోడివిద్యార్థు లబ్బుర మందుచుఁ బరమభాగవతధర్మముల నుపన్యసించు ప్రహ్లాదుని విలోకించి యిట్లు లనిరి. "గుణాఢ్యుఁడా! మన మెల్లరము గురు కులవాసమున భార్గవకుమారులయొద్ద ననేకశాస్త్రసంప్రదా యములను వినుచుంటిమి. వేఱొక సద్గురుఁడు కానరాఁడు. రాజభవనప్రవేశ మన్ననో ముక్కంటికి నైన సాధ్యపడదు. నీ వన్ననో యెన్నఁడును వెలికిఁ జని యెఱుంగవు. ఏ మహో దారచారిత్రుఁడు నీ కీయంతమతిప్రకాశమున కేక్రియఁ దోడ్ప డియెనో వివరింపుము. ఇంతటినుండియు మాస్వాంతముల యందు నిన్నే సేవింతుము. రాజ వని భావింతుము. బహు మానములఁ గావింతుము." ఇత్తెఱంగునఁ దన్నుఁ బరిపరివిధ ముల బ్రస్తుతించు దైత్యనందనులకు భాగవతకులాలంకారుఁ

యోమహాపన్నశరణ్యా!' యని హరినామసంకీర్తన మొనరిం చుచునే కాని క్లేశమున కోహటింపఁడు. అట్టి పరమభక్తుని దివ్య ప్రభావమునకు వెఱఁగందె దనుజేశ్వరుఁడు వానికి ధర్మార్థ కామము లుపదేశింపుఁడని గురుకుమారుల కానతిచ్చి పంచె. వారును మహాప్రసాద మని వానిం గొనిపోయి శక్తివంచనము సేయక బోధింపసాగిరి.

జ్ఞానసింధు వగు నబ్బాలుఁడు గురూపదిష్టశాస్త్రముల యందు భ్రమఁ జెందక యతీతుఁడై సతీర్థబృందమునకుఁ బరమభాగవతధర్మము లుపదేశించి వారల నెల్ల నారాయణ చరణారవింద సేవాపరాయణులఁ గావింప నుద్యోగించుచుండె. అబ్బాలకుని యపారవిజ్ఞానమునకుఁ దోడివిద్యార్థు లబ్బుర మందుచుఁ బరమభాగవతధర్మముల నుపన్యసించు ప్రహ్లాదుని విలోకించి యిట్టు లనిరి. "గుణాఢ్యుఁడా! మన మెల్లరము గురు కులవాసమున భార్గవకుమారులయొద్ద ననేకశాస్త్రసంప్రదా యములను వినుచుంటిమి. వేఱొక సద్గురుఁడు కానరాఁడు. రాజభవనప్రవేశ మన్ననో ముక్కంటికి నైన సాధ్యపడదు. నీ వన్ననో యెన్నఁడును వెలికిఁ జని యెఱుంగవు. ఏ మహో దారచారిత్రుఁడు నీ కీయింతమతిప్రకాశమున కేక్రియఁ దోడ్ప డియెనో వివరింపుము. ఇంతటినుండియు మాస్వాంతముల యందు నిన్నే సేవింతుము. రాజ వని భావింతుము. బహు మానములఁ గావింతుము." ఇత్తెఱంగునఁ దన్నుఁ బరిపరివిధ ముల బ్రస్తుతించు దైత్యనందనులకు భాగవతకులాలంకారుఁ

ప్రవ_త్తి సాగనేర్చుట! ఇంద్రాదిదిక్పాలకులు నాయందు బద్ధ ద్వేషు లయ్యు మదీయాజ్ఞాభంగము సేయ నోడుదురు. మాటి మాటికి గృతాపరాధుఁ డగు వైకుంఠునిఁ బ్రశంసించు నుత్కంఠచేఁ గంఠశోషను జెంద నేమిటికి? కుత్రా! వైకుం ఠుఁడు నీ వన్నయట్లు వీరవ్రతదీక్షాధురంధరుం డేని నే నమర వీరుల దండించి ఖండించునాఁడు ఘోరాహవక్షోణికి రాక కుంఠీభూతుఁడు గానేల? ఓరీదుర్మతీ! ఈ సమస్తభూతశ్రేణికి నేను గాక రాజు వేఱొకఁడెవ్వండు కలఁడు? నేను మద్భ్రాతృ హంతకుని గూర్చి సమస్తభూతధాత్రిని బలుమాఱు శోధించి విడిచితి. మనవంశమునకు నాశకరుం డగు పరిపంథిచరిత్రమును వేవిధంబులఁ గీర్తించి వాని యడుగుదమ్ములను భృత్యుఁడు వోలె సిగ్గుమాలి యారాధింప నేల? పందివై పినతండ్రిని జంపినవానిని వందివై పొగడెదు పిటికిపందవు. ఇయ్యవియే నాకడగొట్టుపలుకు లాలింపుము. మనుగడపై నాశ కలదేని చిత్తమున వానితలఁపు కలనైన నిలుపఁగూడదు. ఓయీ! పసికూనా! నీ వేల యిట్లు కనుగంది పసివాడెదవు? చతుర్వి ధాహారముల నారగించుచు, వందిమాగధులు కైవారములు సలుపుచు వెంట రా సుందరమందయాన లోసంగెడు నివ్వా ళులను స్వీకరించుచు, స్వైరవిహారములు సలుపుచు వైరిసం హారము గావించి మీమాతకు వీరమాత యను పేరు సంపా దించి చిరకీర్తియుతుఁడవు గమ్ము. బిడ్డా! పితృవాక్యమును పాలించి దొడ్డవాఁడవు గమ్మని భయనయముల బోధించె.

ప్రవృత్తి సాగనేర్చుట! ఇంద్రాదిదిక్పాలకులు నాయందు బద్ధ ద్వేషు లయ్యు మదీయాజ్ఞాభంగము నేయ నోడుదురు. మాటి మాటికి గృతాపరాధుఁ డగు వైకుంఠుని బ్రశంసించు సుతున్నంతచేఁ గంతశోషను జెంద నేమిటికి? కుత్తా! వైకుం ఠుఁడు నీ వన్నయట్లు వీరవ్రతదీక్షాధురంధరుం డేని నే నమర వీరుల దండించి ఖండించునాఁడు ఘోరాహవక్షోణికి రాక కుంఠీభూతుఁడు గానేల? ఓరీదుర్మతీ! ఈ సమస్తభూతశ్రేణికి నేను గాక రాజు వేఱొకఁడెవ్వండు కలఁడు? నేను మద్భ్రాతృ హాంతకుని గూర్చి సమస్తభూతధాత్రిని బలుమాఱు శోధించి విడిచితి. మనవంశమునకు నాశకరుం డగు పరిపంథిచరిత్రమును వేవిధంబులఁ గీర్తించి వాని యడుగుదమ్ములను భృత్యుఁడు వోలె సిగ్గుమాలి యారాధింప నేల? పందివై పినతండ్రిని జంపినవానిని వందివై పొగడెదు పిఱికిపందవు. ఇయ్యవియే నాకడగొట్టుపలుకు లాలింపుము. మనుగడపై నాశ కలదేని చిత్తమున వానితలఁపు కలనైన నిలువఁగూడదు. ఓయీ! పసికూనా! నీ వేల యిట్లు కనుగంది పసివాడెదవు? చతుర్వి ధాహారముల నారగించుచు, వందిమాగధులు కైవారములు సలుపుచు వెంట రా సుందరమందయాన లొసంగెడు నివ్వా ళులను స్వీకరించుచు, స్వైరవిహారములు సలుపుచు వైరిసం హారము గావించి మీమాతకు వీరమాత యను పేరు సంపా దించి చిరకీర్తియుతుఁడవు గమ్ము. బిడ్డా! పితృవాక్యమును బాలించి దొడ్డవాఁడవు గమ్మని భయనయముల బోధించె.

భరుఁ డీసభాస్తంభమునఁ గలఁడే? వానిని నా కిప్పుడఁ బ్రత్య క్షము సేయ నేర్తువే? యని యాడుగఁజుచు హుంకరించె. మూర్తీభవించిన శుద్ధసత్త్వమో యన నొప్పు నబ్బాలుఁడు భీతిల్లక "విశ్వపతి విశ్వమయుఁడు విశ్వాత్మకుఁ డీసభాస్తం భాంతర్గతుఁ డగుటకు సందియ మేమి? సర్వోపగతుం డగు చక్రి యిందుఁ గలఁ డందుఁ లేఁ డని సందియమందుట మంద బుద్ధుల లక్షణము. చూడ వేడుక యగుడుఁ గానరాకుం డునే?" యని మిన్నకుండె. దాని కా రక్కసిఱేఁ డుక్కు మిగిలి క్రోధోద్దీపితనేత్రుఁడై కరాళించి దిగ్గున గద్దియ డిగ్గి కరవాలము ఝుళిపించుచు మహాసంరంభమున సభాస్తంభమును బ్రహరించె.

తత్క్షణమే యా స్తంభమునఁ బ్రళయాభీలసంరంభ మున సటాచ్ఛటలు గంపింప దుర్నిరీక్ష్యప్రతాపోజ్జ్వలహర్యక్ష మస్తకుండగు నృసింహదేవుఁ డావిర్భవించె. అజ్ఞారే! ఆనక్తం చరవీరుని యీప్సితంబు సిద్ధింపఁ జేయుటకై విచిత్రావతార మున శ్రీమహావిష్ణువును జడపదార్థమున సాక్షాత్కరింపఁ జేసిన ప్రహ్లాదుని భక్తిప్రభావ మెంత బలీయమైనది! కేసరి యాకారమున దిశలు గంపింపఁజేయు నవతారమూర్తిని గాంచి దనుజాధినేత తనకుఁ గాల మాసన్న మైనదని గ్రహించి వీరపురుషోచితమరణ మపేక్షించి యుత్తలపాటున గద నెత్తు కొని మిత్తి నెదుర్కొనె. అట్లు పెద్దయుం బ్రొద్దు తన్ను కొని యాహవ మొనరించు రక్షోవీరుని బంధించి యా నర

భరుఁ డీసభా స్తంభమునఁ గలడే? వానిని నా కిప్పుడఁ బ్రత్యక్షము సేయ నేర్తువే? యని యార్భటించుచు హుంకరించె. మూర్తీభవించిన శుద్ధసత్వమో యన నొప్పు నబ్బాలుఁడు భీతిల్లక "విశ్వపతి విశ్వమయుఁడు విశ్వాత్మకుఁ డీసభా స్తంభాంతర్గతుఁ డగుటకు సందియ మేమి? సర్వోపగతుం డగు చక్రి యిందుఁ గలఁ డందుఁ లేఁ డని సందియమందుట మంద బుద్ధుల లక్షణము. చూడ వేడుక యగుడుఁ గానరాకుండునే?" యని మిన్నకుండె. దాని కా రక్కసిఱేఁ డుక్కుమిగిలి క్రోధోద్దీపితనేత్రుఁడై కరాళించి దిగ్గున గద్దియ డిగ్గి కరవాలము ఝుళిపించుచు మహాసంరంభమున సభా స్తంభమును బ్రహరించె.

తత్ క్షణమే యా స్తంభమునఁ బ్రళయాభీలసంరంభమున సటాచ్ఛటలు గంపింప దుర్నిరీక్ష్య ప్రతాపోజ్వలహర్యక్షమస్తకుండగు నృసింహదేవుఁ డావిర్భవించె. అజ్ఞారే! ఆనక్తం చరవీరుని యీప్సితంబు సిద్ధింపఁ జేయుటకై విచిత్రావతారమున శ్రీమహావిష్ణువును జడపదార్థమున సాక్షాత్కరింపఁ జేసిన ప్రహ్లాదుని భక్తిప్రభావ మెంత బలీయమైనది! కేసరి యాకారమున దిశలు గంపింపఁజేయు నవతారమూర్తిని గాంచి దనుజాధినేత తనకుఁ గాల మాసన్న మైనదని గ్రహించి వీరపురుషోచితమరణ మపేక్షించి యుత్తలపాటున గద నెత్తుకొని మిత్తి నెదుర్కొనె. అట్లు పెద్దయుం బ్రొద్దు తన్నుకొని యాహవ మొనరించు రక్షోవీరుని బంధించి యా నర

భీకరఖరనఖరముఖవిరాజితమైన నృసింహవిగ్రహమై భీషణాకారమున నంటుటం జేసి లచ్చియుఁ జేర వెఱచి పలికిన మాఱుపలుకక విభుఁ డలుగు నేమో యని యొదిఁగి నిలిచి యుండె. ఆప్రళయభీకరమూర్తిని శాంతింపఁజేయ నొరుల కలవి గాకుండుటచే వారిజసంభవుని పనుపునఁ బ్రహ్లాదుఁడే యందుల కియ్యకొనియె. భక్తులకు సాధింపరానికార్యము లుండునే? అంతట భాగవతశేఖరుఁ డయిన బాలకుఁడు కరకమలములు ముకుళించి మందగమనమున శ్రీహరిసన్నిధిం జేరి

మ. "ఖరదంష్ట్రాభ్రుకుటీసటానఖయు నుగ్రధ్వానయున్ రక్తకే
సరయున్ దీర్ఘతరాంత్రమాలికయు భాస్వన్నేత్రయు న్నైన నీ
నరసింహాకృతిఁ జూచి నే వెఱవఁ, బూర్ణక్రూరదుర్వారదు
ర్భరసంసారదవాగ్నికిన్ వెఱతు నీపాదాశ్రయుం జేయవే."

యని పలుతెఱంగులఁ బ్రార్థింపఁ దొఁడగె. అంత భక్తపరాధీనుఁ డగు నయ్యీశ్వరుం డబ్బాలకుని విలోకించి కరుణాయత్తచిత్తుండై సర్వమంగళప్రశస్తం బగు నిజహస్తమును వాని మస్తకమున నిడి,

శా. "సంతోషించితి నీచరిత్రమునకున్ సద్భద్రమౌ గాక! నీ
యంతర్వాంఛితలాభ మెల్లఁ గరుణాయత్తుండనై యిచ్చెదం
జింతం జెందకు భక్తకాముఁడ నే సిద్ధంబు దుర్లోక్యుఁడన్
జంతుశ్రేణికి నన్ను జూచినఁ బునర్జన్మంబు లే దర్భకా."

అని యభయం బిడి భద్రం బయ్యెడుఁ గాక యని యాశీర్వదించి "వత్సా! నీకుం గల కామితార్థము లెవ్వి

భీకరఖరనఖరముఖవిరాజితమైన నృసింహవిగ్రహమై భీషణాకారమున నుండుటం జేసి లచ్చియుఁ జేర వెఱచి పలికిన మాఱుపలుకక విభుఁ డలుగు నేమో యని యొదిఁగి నిలిచి యుండె. ఆప్రళయభీకరమూర్తిని శాంతింపఁజేయ నొరుల కలవి గాకుండుటచే వారిజసంభవుని పనుపునఁ బ్రహ్లాదుఁడే యందుల కియ్యకొనియె. భక్తులకు సాధింపరానికార్యము లుండునే? అంతట భాగవతశేఖరుఁ డయిన బాలకుఁడు కరకమలములు ముకుళించి మందగమనమున శ్రీహరిసన్నిధిం జేరి

మ. "ఖరదంష్ట్రాభ్రుకుటీసటానఖయు నుగ్రధ్వానయున్ రక్తకే
సరయున్ దీర్ఘతరాంత్రమాలికయు భాస్వన్నేత్రయున్నైన నీ
నరసింహాకృతిఁ జూచి నే వెఱవఁ, బూర్ణక్రూరదుర్వారదు
ర్భరసంసారదవాగ్నికిన్ వెఱతు నీపాదాశ్రయుం జేయవే."

యని పలుతెఱంగులఁ బ్రార్థింపఁ దొడఁగె. అంత భక్తపరాధీనుఁ డగు నయ్యీశ్వరుం డబ్బాలకుని విలోకించి కరుణాయత్తచిత్తుండై సర్వమంగళప్రశస్తం బగు నిజహస్తమును వాని మస్తకమున నిడి,

శా. "సంతోషించితి నీచరిత్రమునకున్ సద్భద్రమౌ గాక! నీ
యంతర్వాంఛితలాభ మెల్లఁ గరుణాయత్తుండనై యిచ్చెదం
జింతం జెందకు భక్తకాముఁడ నే సిద్ధంబు దుర్లోక్యుఁడన్
జంతుశ్రేణికి నన్నుఁ జూచినఁ బునర్జన్మంబు లే దర్భకా."

అని యభయం బిడి భద్రం బయ్యెడుఁ గాక యని యాశీర్వదించి "వత్సా! నీకుం గల కామితార్థము లెవ్వి

కుచేలుఁడు

ప్రాచీనకాలమునుండియు భారతవర్షము మహాభక్తుల కాశ్రయమై చిరకీర్తి గాంచినది. ఈపుణ్యభూమిని దాదాపుగా నైదువేలసంవత్సరములకుఁ బూర్వ మొకమహాభక్తుఁడుదయించె. ఆతనిపవిత్రమూర్తి భారతహృదయపీఠమున స్థిరవసతి నేర్పఱచుకొని నేఁటివఱకును దదీయసంతానముచే నారాధింపఁబడుచున్నది. ఆతని దివ్యనామము భారతదేశచారిత్రమున సువర్ణశోభాకలితం బయి యువయువతీజనంబులకు మంత్రరాజమై విరాజిల్లుచున్నది.

ఆభక్తజనపాలుఁడు కుచేలుఁడు. ఇట్టిసుగుణాలవాలుని గడుపారఁ గాంచి తరించి మించిన పుణ్యదంపతులనామము లెంతధన్యములో! ఈతఁడు వైదికసంప్రదాయమునఁ బ్రవర్తించు బ్రాహ్మణకుటుంబమునకుఁ జెందినవాఁడు. వీనివిద్యార్థిజీవితము వారణాశీపురప్రాంతమున నున్న యవంతీనగరమునఁ బ్రదర్శింపఁ బడుటచే నీతని జన్మస్థానము తత్సమీపస్థంబు కానోపు. అయినను సర్వజనహృదయసీమల వాస మొనరించు నీభూసురనాయకుని జన్మస్థలనిర్దేశవిమర్శనముతోఁ బాఠకులకుఁ బ్రశక్తిలేదు. అవంతీపురవాసి యగు సాందీపుఁ డీతని విద్యాగురువు. లోకోత్తరచారిత్రుఁ డగుకుచేలుని గురుకులవాసమునుగూర్చి నేర్చుకొనుట మనకు శ్రేయోదాయకము కానోపు.

కుచేలుఁడు

ప్రాచీనకాలమునుండియు భారతవర్షము మహాభక్తుల కాశ్రయమై చిరకీర్తి గాంచినది. ఈపుణ్యభూమిని దాదాపుగా నైదువేలసంవత్సరములకుఁ బూర్వ మొకమహాభక్తుఁ డుదయించె. ఆతనిపవిత్రమూర్తి భారతహృదయపీఠమున స్థిర వసతి నేర్పఱచుకొని నేఁటివఱకును దదీయసంతానముచే నారాధింపబఁడుచున్నది. ఆతని దివ్యనామము భారతదేశచారిత్రమున సువర్ణశోభాకలితం బయి యువయువతీజనంబులకు మంత్రరాజమై విరాజిల్లుచున్నది.

ఆభక్తజనపాలుఁడు కుచేలుఁడు. ఇట్టిసుగుణాలవాలుని నడుపారఁ గాంచి తరించి మించిన పుణ్యదంపతులనామము లెంతధన్యములో! ఈతఁడు వైదికసంప్రదాయమునఁ బ్రవర్తించు బ్రాహ్మణకుటుంబమునకుఁ జెందినవాఁడు. వీనివిద్యార్థి జీవితము వారణాశీపురప్రాంతమున నున్న యవంతీనగరమునఁ బ్రదర్శింపఁ బడుటచే నీతని జన్మస్థానము తత్సమీపస్థంబు కానోపు. అయినను సర్వజనహృదయసీమల వాస మొనరించు నీభూసురనాయకుని జన్మస్థలనిర్దేశవిమర్శనముతోఁ బాఠకులకుఁ బ్రశక్తి లేదు. అవంతీపురవాసి యగు సాందీపుఁ డీతని విద్యాగురువు. లోకోత్తరచారిత్రుఁ డగుకుచేలుని గురుకులవాసమునుగూర్చి నేర్చుకొనుట మనకు శ్రేయోదాయకము కానోపు.

ఇమహృదయము లన్యోన్యసౌహార్దమునఁ బాదుకొనిననాఁటఁ
గోలె ప్రాణమిత్రులై శాస్త్రాధ్యయనాదులయందును, కేళీ
విలాసములయందును, గురుసేవనమునందును నరపొరలు
మాని యొక్కప్రాణముగ వర్తింపసాగిరి. వారిసంగాతము
దినములవెంబడి బలపడి శుక్లపక్షచంద్రునిచంద్రికను బురు
డించుచుండె. కుచేలునిసంగడీఁడు నీలమేఘచ్ఛాయఁ బోలు
మేనివాఁడు. పద్మపత్రముల నిరసించు నేత్రములవాఁడు.
ఆజానుబాహుగుల్ఫములవాఁడు. కర్ణకుండలములవాఁడు.
కౌస్తుభాలంకారుఁడు. సునిశితబుద్ధిసంపద గలవాఁడు. అయిన
నేమి? ఆసవమస్థాకారుని కీవిప్రబాలునియందుఁ గల
యవ్యాజానురాగమునకు హద్దు లేదు. జగన్మోహనాకార మగు
వానిరూపమునకుఁ దోడపూర్వమేధాసంపత్తికూడఁ గలదు.
కావుననే యసమానశేముషీరాజితుఁ డగుకుచేలుని గుర్తించి
చెలిమి చేయఁ గలిగె. శిష్యకోటియం దీయిర్వురవటుల
యందును సాందీపునికిఁ గలప్రేమభర మింతిం తనరాదు. బుద్ధి
సూక్ష్మత గలశిష్యులయందు గురుస్వాముల కట్టిప్రేమానురా
గము లుదయించుట సహజమే గదా! క్రియాకారులు తమ
గురువులను మర్కటకిశోరన్యాయమున ననుగమించిన, వారు
మార్జాలకిశోరన్యాయమున సాకుచుందురు. ఆనాఁటివిద్యార్థు
లకు గురుదంపతులే దైవసము లగుటంజేసి వారియెడ నఱ
మరలేనికూరిమి మెఱయ నిర్మలాంతఃకరణముతో వారు గురు
పూజనము గావించుచుందురు.

నిరంతరగురుసేవానిరతుం డగుకుచేలుం డొకనాఁడు తనయిష్టసఖుని గూడుకొని గురుపత్నీనియుక్తుండై సమిధలు గొని తేర నడవికిఁ జనియె. అంతలో జీమూతవ్రాతములు విజృంభించి ఘుమఘుమారావములతో నాకసమున విహరింపఁ దొడంగె. నానావిధజంతుసంతానమునకుఁ ప్రళయమట్లు ఝంఝూనిలము భీషణఘోషణమున వీవఁ బూనె. దిగ్వేదండములతుండములభాతి వర్షధార లిలాతలమ్మున ముమ్మరముగఁ బడుచుండె. విద్యుల్లతలు ఖద్యోతకిరణనికరమును మఱపించుచుండె. అరమ్రుగ్గి మ్రగ్గినఫలంబుభాతి పతంగబింబము చరమాద్రిమాఁటునఁ జేరుకొనియె. అంధకారము నీరంధ్రమై కకుబంతముల నాశ్రయించె. సందుగొందులుఁ మిట్టపల్లములు నేర్పరించుట కసాధ్యముగ నుండె. కటికి చీఁకటిని గన్నులు గానరాక వటువు లొండొరులు చేతులూఁతగఁ గొని కాననాంతరమున నడయాడుచుండిరి. శరీరావయవములు ప్రభూతశీతమునఁ గొంకువోవసాగె. గురుభక్తితత్పరుం డగు కుచేలుం డానడికిరేయి మిత్రునిఁ గూడికొని పడినయిత్తలపాటు చెప్పఁ దరము కాదు. కొలకొలగూయుపక్షులకూజితములును దెలతెలవాఱుదూర్పు రేఖలును మందమందగమనమున వీతెంచుశీతవాతపోతములును ప్రభాతసమయమును సూచించుచుండె. అంతటఁ బొడుపుగుబ్బలిరాయనికిఁ గిరీటమై యంశుమంతుఁడు జూపట్టె. తెలివెలుంగులు దిగ్వితానమున నిండె.

అ త్తఱి వానతాఁకునకును వలిగాలిసోఁకునకును శిష్యు లేమైరోకో యని యడలు నొడమ సాందీపుఁడు వారిని వెదక బయలువెడలెను. కొండొకవడికిఁ జెక్కు చెదరక యడవి త్రోవను నడచివచ్చు చిన్నవడుగులఁ బొడఁగని స్వాంతమున సంతసించి వారిని జేరఁజీరి కుర్చిచ్చి కవుఁగిలించుకొని కటకటం బడుచు నాత్మఖేదమును వెలిపుచ్చె. పిమ్మట వారి నుద్దేశించి సాందీపుఁ డిట్లనియె. "శిష్యులు మాకొఱకు దారుణాటవిని సముత్కటపరిపీడ నొందితిరి. మాఋణము నీఁగుట కిదియె చాలును. కావున నిటమీఁద మీకు సమకూరెడుఁ జో విస్ఫుటధనబంధుదార బహుపుత్రవిభూతి జయాయురున్నతుల్ అని దీవించి గారవించి నిజమందిరమునకుఁ దోకొనిపోయె. ఔరా! కుచేలా! నీజీవిత మెంత ధన్యమైనది? నీభావిజీవిత పరిణామమునకు సద్గురుని యాశీర్వాదము మార్గదర్శక మగును గాక! అంతటితో మనవటువుల గురుకులవాసదీక్ష ముగిసెను. అనంతరము వారు గురుదంపతుల మంగళాశాసన ములతోఁ దమతమ భవిష్యజ్జీవితపరమార్థచింతలతో శాంతి నికేతనమును వీడి తమతమనివాసంబులకుం జనిరి.

ప్రణయతత్త్వమును బోధించు శుకపికశారికానికరం బుల మనోహరగీతములనడుమ నిశ్చింతముగను నిశ్చలదీక్ష తోను నిరంతరోత్సాహముతోను వేదాదివివిధవిద్యల నభ్య సించి సులభసుఖం బగు తద్బ్రహ్మచర్యాశ్రమము నిప్పుడు డిగ్గవిడిచి కుచేలుఁడు వివిధవిషయవాసనారంగ మగు గృహస్థా

క్రమమునఁ బ్రవేశించె. అతఁడు మానధనుఁడును, విజితేంద్రియుఁడును, బ్రహ్మవేత్తయు, శాంతుఁడును, హరిపాదతీర్థసంసేవానిరతుఁడును నై నెగడు పరమభాగవతాగ్రేసరుఁడైనను నిరంతరమహాఘోరదారిద్ర్యమునఁ బీడింపఁబడుచుండె. కాలక్రమమునఁ గులశీలరూపాభిజాత్యయగు సుశీలవలనఁ బెక్కండ్రు సుతులఁ బడసె. బాపురే! శాంతి దాంతి వైరాగ్యసంపదలనడుమ నుద్దీపించు పరమభాగవతశ్రేష్ఠుఁడు దుస్సహదారిద్ర్యపీడకు లోఁబడక తీఱినది కాదు. ఎంతవాని కేని విధి యలంఘనీయము కదా! దారిద్ర్యదవానలమునఁ బడి మడియునాఁడు కూడ కుచేలుఁడు పరద్రవ్యమును లోష్ఠముక్రియ భావించి నిరసించునే కాని లేమివశమున దేహి యని పరుల యాచింపఁడు. తనకుఁ దానబ్బినట్టియల్పమే పదివేలుగ భావించి యుబ్బుచుఁ బుత్రదారాభిరతుఁను నొకవిధమునఁ గాపించుచుండె.

ఒకనాఁడు బిడ్డలు దుస్సహదరిద్రపీడచే నొచ్చియాఁకటిచిచ్చునఁ గృశియించి మలమలమాడిపోవుచుఁ బెదవులు దడుపుకొనుచుఁ గడుపులు నకనకలాడుచు వెన్నునకంటుకొనిపోవఁ జూచువారలగర్భకుహరము లవియునట్లుగ నాకుదొప్పలు చేతఁ బట్టుకొని 'యమ్మా పట్టెఁడోగిరమును బెట్టవే' యని యంగలార్చుచుఁ దల్లిని సమీపించి చినిఁగిన చీరకొంగును బట్టి లాగఁ జొచ్చిరి. కొందఱు తల్లిని జుట్టుముట్టి యాహారసంపాదనమునకై పరిదేవన మొనరించుచుండిరి.

మఱికొందఱు కాలుసేతు లల్లాడుచుండ నడయాడ నేరక యొకచోఁ గూలఁబడి 'యమ్మా కడుపు మాడుచున్నదే' యని యంగలార్చుచుండిరి. దారిద్ర్యదేవత తనివినొందఁజాలక బహుపుత్రరూపముల నాపెఁ జుట్టుముట్టి కాఱియపెట్టుచుండ మూర్తి దాల్చిన శోకదేవత నా నొప్పారు నాయిల్లాలిని గాంచినవారియుల్లములు శతధా భిన్నము లగుచుండె. అంత నాసాధ్వి చేయునది లేక వెడఁదకన్నులఁ దొరఁగు వేడిబాష్పములఁ గొనగోట మీటుచు నిజాధినాథుని జేరి "యోజీవితేశ ! తట్టుముట్టాడు పేదఱికమిట్లు కాఱియవెట్టుచుండ దీని కుపాయమూహింపరైతిరి. నాథా ! బిడ్డ లాహారాపేక్షం గావించు పరిదేవనములు హృదయవిదారణ మొనరించుచున్నవి. వారి యాక్రందనధ్వనులచే హృదయము ప్రీలి వ్రక్క లగుచున్నది. ప్రాణేశ్వరా ? ద్వారకాధినాథుఁ డగు పద్మపత్రనేత్రుఁడు మీ బాల్యసఖుఁ డని విందును. కాన మీ రట కేగి హరికృపాకటాక్షదీప్తిచే దారిద్ర్యాంధకారమగ్నుల మగు మమ్ముద్ధరింపరే" యని వేఁడుకొనియె.

అందుల కాభూదేవోత్తముఁడు డెందమునఁ గ్రించుదన మూనక యమ్మానినీమణి పలుకుసమయోచితవచనంబుల కలరి యారాజీవనేత్రు నాశ్రయింపఁ జనుట యిహపరసాధనమని విశ్వసించె. తోడ్తోన శైశవక్రీడాకలాపములు స్ఫురణకుం దవిలి మిత్రదర్శనోత్సాహమును రెట్టించెను. కాని యాచక్రపాణికిఁ గానుక యేమైనఁ గొంపోవలయు నని వాని

యూస్థ. నిజాధినాథునియూత్మగతం బెఱిఁగి వానియిల్లాలు చంద్రునకు నూలుపోఁగుచందమున వానిజీర్ణచేలాంచలమునఁ బృథుకతండులములఁ గొన్నిటి ముడిచి నెయ్యము నెఱపె. గోవిందసందర్శనోత్సాహియై వెడలు కుచేలుఁడుతనడెందమున నిట్లు వితర్కింప సాగె. "భర్మమణిమయగోపుర ప్రాసాద సౌధహర్మ్యప్రభావిలసిత మగు ద్వారకానగర మెక్కడ! భాసురశుద్ధాంతవాసి యగుపుండరీకాక్షుఁ డేడ! ఆయఖిలేశుని సందర్శించుమహాభాగ్య మెట్టిది? ఆనగరికావలివాం 'డెక్కడి విప్రుఁడవు? ఇందేల వచ్చితి?' యనుచు నడ్డువెట్టిరేని వారల కేమియొసంగి సమ్మతులఁ జేయువాఁడ? ధనహీనుఁడ. అయదు కులాంబోధి చంద్రుని దర్శించుటకు నాయాశాతరంగము విజృంభించుచున్నది. నన్నాతఁ డుపేక్ష సేయునా? ఆ! యివి యేటిమాటలు? కానిమ్ము నాభాగ్య మెట్లున్నదో చూచెదఁ గాక." అని తలపోయుచు నడచుచుండఁ గట్టెదుట,

మ. కనియెన్ భూసురవంశశేఖరుఁడు రంగత్ఫుల్లరాజీవకో
కనదోత్తుంగతరంగసంగతలసత్కాసారకన్ భూరిశో
భనని త్యోన్నతసౌఖ్యభారకను శుంభద్వైభవోదారకన్
జనసంతాపనివారకన్ సుజనభాస్వత్తారకన్ ద్వారకన్.

అట్టిపురవైభవమున కక్కజ మందుచు రాజమార్గంబునఁ జని చని పెక్కుకక్ష్యాంతరములు గడచి చనుచు, ముందర నొక సుందరవధూమణిమందిరమున నిందీవరనేత్రలు చామరములు వీవ హంసతూలికాతల్పమున,

సీ. ఇందీవరశ్యాము వందితసుత్రాముఁ గరుణాలవాలు భాసురకపోలుఁ
గౌస్తుభాలంకారుఁ గామితమందారు సురుచిరలావణ్యు సురశరణ్యు
హార్యక్షనిభమధ్యు నఖిలలోకారాధ్యు ఘనచక్రహస్తు జగత్ప్రశస్తు
ఖగకులాధిపయానుఁ గౌశేయపరిధానుఁ బన్నగశయను నబ్జాతనయను
మకరకుండలసద్భూషు మంజుభాషు। నిరుపమాకారు దుగ్ధసాగరవిహారు
భూరిగుణసాంద్రు యదుకులాంభోధిచంద్రు। విష్ణురోచిష్ణుజిష్ణుసహిష్ణుఁ గృష్ణు

నవలోకించె. ఇట్లు బహువినోదములం దనరి లావణ్యామన్మథాకారుం డగు పుండరీకాయతాక్షుఁడు కన్నులచందమామయై కనుపట్టఁ, జిన్ననాఁట గురుకులవాసావసరమున సహపాఠియుఁ బ్రాణమిత్త్రుఁడును నగుగోపాలబాలకునికలరూపు గుర్తెఱింగి, బాల్యస్నేహపాటవమునఁ జెలియలికట్ట దాఁట సంకించుభావతరంగముల పోటుపాటులనడుమ నుయ్యాల లూఁగుచుఁ బార్వణచంద్రబింబము నాఁ దగునాతనిచల్లనిమూర్తిని గాంచి, యార్తి దీఱ జోతలిడి యర్ధోన్మీలితనేత్త్రుఁడై కుచేలుఁడు పులకితగాత్త్రుఁడై యల్లనల్లన నాతని సమీపింపఁ బోవుచుండె.

అత్తెఱంగున ఘనతృష్ణాతురచిత్తమున నుత్తలమందువానిని, హాస్యమునకుఁ జోటైనవానిని, జీర్ణాంబరధరుని, నశ్రాంతదరిద్రపీడితుని, కృశీభూతాంగమునఁ దను జేర సంకించు పేదవిప్రుని నల్లంతనె కని, శ్రీకృష్ణుఁడు సంభ్రమాదరాయత్తచిత్తంబునఁ దల్పమును డిగ్గి యెదురేగి బంధుస్నేహస్ఫురణమునఁ దోడితెచ్చి నిజతల్పమున సుఖాసీనునిం జేసె.

తదనంతరము కనకకలశసలిలముచేఁ గాళ్ళు గడిగి భక్తిమై తజ్జలంబులు శిరసునఁ జల్లుకొని మనోహరమృగమదఘనసార మిళితమలయజమును మేన నలంది శ్రీహరి తాళవృంతమును జేఁబూని విప్రుని శ్రమ వాయ వీవఁ దొడంగెను. ఆ చెంగటఁ బద్మలోచనుఁడు మన్నించు నంగనామణి యగురుక్మిణి కరకంక ణంబులు గల్లు మనఁ జామరంబు గొని చల్లఁగ వీఁచుచుండె భళిరా! మణిమయగోపురప్రాసాదసౌధహర్మ్యముల నివ సించు మురహరుం డేడ? అడవినడుమ నాకుటింటఁ గాఁపు రము సేయు బడుగుబాపఁ డేడ! బాల్యస్నేహస్ఫురణ మెంత శ్లాఘాపాత్రము? ఇట్టివింతను గాంచుసుద్ధాంతకాంతానివ హంబు లద్భుతతరంగితాంతరంగులై యిట్లు తలపోయసాగిరి.

ఉ. ఏమితపంబు సేసె నొకో యీధరణీజవిజోత్తముండు తొల్
బామున యోగివిస్ఫురదుపాస్యకుఁడై తనరారుసజగ
త్స్వామి రమాధినాథునిజతల్పమునన్ వసియించియున్నవాఁ
డీమహనీయమూర్తి కెనయే మునిపుంగవు లెంతవారలున్.

అదియునుం గాకఁ,

చ. తనమృదుతల్పమందు వనితామణి యైనరమాలలామహెం
దును నెడఁగాఁ దలంపక యదుప్రవరుం డెదురేగి మోదముం
దనుకఁగఁ గౌఁగలించి యుచితక్రియలం బరితుష్టుఁ జేయుచున్
వినయమునన్ భజించె ధరణీసురుఁ డెంతటిభాగ్యవంతుఁడో?

ఈతీరున రమాధినాథునిమృదుతల్పమున శయనించి మేనఁ బులకాంకురంబులు మొలకలెత్త నానందబాష్పబిందు

సందోహుండై విలసిల్లుపరమభాగవతోత్తముండగు కుచేలునిఁ గాంచి కరముఁ గరమునఁ గీలించి గురుకులవాసోదంతమును సాంతముగ శ్రీహరి ముచ్చటింప దొరకొనియె. వెండియు గృహక్షేత్రధనదారపుత్రాదులయందుఁ గుచేలునిచిత్తము వేఱై యుండుటఁ గాంచి యుత్తమమార్గమును సూచించి, కుటుంబక్షేమములఁ బరామర్శించి పిన్ననాఁటిచైదములఁ దల పోయసాగె. విద్యాభ్యాసావసరమునఁ దాముకావించిన చెలి కారమును దలపోయుచు దేశికోత్తమునిశక్తిసామర్థ్యములను, దాము గావించినశుశ్రూషావిధానమును, ప్రళయానిలంబు చందమునఁ బెనుగాలివీఁచిననాఁటిరాత్రి తా మొంటిగ నరణ్య భూమిని బడినబాములును, గురుదంపతులయవ్యాజానురాగ ప్రకటనమును దలపోసి యిరువురు నానందమునం దేలియాడు చుండిరి.

ఇట్లు పెద్దయుంబ్రొద్దు గడచుటయు సర్వలోకహృదం తర్వర్తి యగు నాయదుకులచక్రవర్తి మందహాసరోచిరుదం చితసుందరవదనారవిందుఁడై కుచేలునిం గాంచి యిట్లనియె. "సఖుఁడా! మదీయసందర్శనార్థ మీవు విట కరుదెంచుచు నాకుఁ గానుకగ నేమి తెచ్చితివి? అప్పదార్థ మెట్టిది యైనను గొంచె మైనను గొప్పగ భావించి స్వీకరింతు. సందియంబు వలదు. భక్తితాత్పర్యములు ప్రధానములు గాని వస్తుపరిమితి కానోపదు. భక్తిశూన్యుఁ డగునీచవర్తనుఁడు హేమాచల తుల్యం బైనపదార్థము పారితోషికముగ నిడినను నాయు

ల్లము పల్లవింపదు. భక్తిప్రధానుఁ డగు మానవుఁ డొసంగు దళమైనను, బుష్పమైనను, ఫలసలిలము లైనను, నమృతమ స్తని యారగించెద." అనవుడు నావిప్రవరుఁడు సంకోచించి మోము వంచి మిన్నకుండె. అందుల కానందనందనుఁడు సందియ మంది కలహూవు దివ్యచిత్తమున గ్రహియించి "తొల్లింటిభవమున నీతఁ డైశ్వర్యకాముఁ డైనను సేవింప నొల్లఁడు. అయిన నికుచేలుఁడు నిజకాంతాముఖోల్లాసంబు కొఱకు నన్నాశ్రయించినవాఁడు. కాన నీతని కింద్రాదుల కందఁగా రాని సంపద్విశేషంబు లీక్షణంబ యనుగ్రహింప వలయు" నని తలంచి జీర్ణచేలాంచలంబున నతఁడు ముడిచి తెచ్చినయడుకులముడిని దడవి "మిత్రమా! యిది యేటిపస దన?" మని నుడువుచు నమ్ముడిని దనకరకమలముల విచ్చి నిండారుముదంబునఁ బృథుకతండులంబులను గొని, యియ్యవి సకలలోకములను నన్నును బరితృప్తిం బొందింపఁ జాలు నని భుజియించి, వెండియుఁ బిడికెఁడడుకులఁ బరిగ్రహింప సమ కట్టుడు, కమలానన తత్కరకమలముఁ బట్టి యిట్లనియె. "త్రిజగత్సంపత్కరా! దేవదేవ! సర్వాత్మక! హరీ! బహు విధసంపదాళి నందింప నివియె చాలును. క్రమ్మఱ భుజియింప నేల? భక్షింప నుడుగుఁ" డని ప్రార్థించె. తదనంతరము వారు గొంతదనుకఁ బరస్పరవిస్రంభసంభాషణములతోఁ గాల మేగించిరి. కుచేలుఁ డారాత్రి గోవిందుమందిరమున హృద యానందకరం బగు విం దారగించి, మృదులశయ్యాతలంబున

నిదురించి, తనకుఁ దాను సమధికస్వర్గభోగానుభవుం గాఁ దలంచుచు, మఱునాఁటి వఱువాత మేల్కాంచి నిత్యకృత్యములఁ దీర్చికొని, యిందిరారమణునికడ వందనపూర్వకముగ సెలవు గైకొని, యాతనిచే నామంత్రితుం డయి నిజపురాభిముఖంబుగ నడచుచుఁ, దనడెందమున గోవిందసందర్శనానంద సంజనితమహానందమున నిట్లు వితర్కింపఁ దొడఁగె.

“ఆహా! మదీయపూర్వజన్మసుకృతం బెంతఘనంబైనది! అనన్యసామాన్యదుర్లభం బగు పరంధాముని దివ్యసందర్శనము నిరాయాసముగఁ గరస్థమైనది. నిరంతరదారిద్ర్యాంధకారమునఁ దోదూఁగులాడు నే నెక్కడ? నిత్యలక్ష్మీవిలాసుఁడై తనరారు వాసుదేవుఁ డెక్కడ? ఏకగర్భసంజాతునికన్న మిన్నగఁ బరిరంభణాదిక్రియల నన్నాతఁ డాదరించి, తల్పమున నుంచి మన్నించి, నిజవధూకరసరోజాతకలితచామరానిలమున విగతశ్రమునిఁ జేసి, త్రైలోక్యరక్షణప్రశస్తంబులగు హస్తంబులచే నడుగు లొత్తి భక్తి నెఱపె. దరిద్రుఁడు సంపదంధుఁడై హరిపాదసంసేవనావిరక్తికిఁ దవిలి నశియించు నని కాక, లేకున్న శ్రితార్తిహరుండు నన్ను సర్వవస్తుసమధికునిగాఁ జేయకుండునే?” యని తలపోయుచుఁ జని చని కట్టెదుట,

సీ. భానుచంద్రప్రభాభాసమానస్వర్ణచంద్రకాంతోపలసౌధములును
గలకంఠ శుక నీలకంఠసముత్కంఠమానితకూజితోద్యానములును
ఫుల్లసితాంభోజ హల్లక కహ్లార కైరవోల్లసితకాసారములును
మణిమయకనకకంకణముఖాభరణవిభ్రాజితదాసీదాసీజనములుఁ
గలిగి చెలువొందుసదనంబు గాంచి... ... ...

యచ్చెరు వొందుచు వైభవోన్నతలక్ష్మీనివాస మగు నీసౌధతలమున వసియించు భాగ్యశాలి యెవ్వఁడోకదా! యని తలపోయుచుండునవసరమున, దివిజకాంతలఁ దిరస్కరించు చేడియలు కొందఱు సమీపించి 'స్వామీ! యిందు విచ్చేయుఁ' డని వియ్యము నెఱపిరి. అంతలోఁ బతిరాకను గ్రహించి వినయవినమితగాత్రమున రూపొందిన యిందిరాదేవిచంద మునఁ బతివ్రతాతిలక మగు సుశీలాదేవి నాథుని సన్నిధాన మున కరుదెంచి సువర్ణకలశజలంబులఁ బాదములు గడిగి మెత్తనిపట్టుపుట్టంబులఁ దడియార నొత్తి మించినభక్తితోఁ గమనీయపద్మరాగస్తంభకములును, మరకతనవరత్నమయ కవాటములును, జంద్రకాంతోపవేదికాజాలములును, నత హంసతూలికాతల్పములును గలిగి చెలువొందుమందిరాంగణ మునకుఁ దోడ్కొనిపోయి రత్నసింహాసనాసీనునిఁ గావించె. ఈచందమున నాతఁ డప్రయత్నంబుగ నచిరకాలంబునఁ దమకు లభ్యమయిన వివిధచిత్రసంపదాళిని గాంచి మాధ వానుగ్రహ మని తలంచి, హరిదయావలోకనశ్రీల కభివంద నము లొనరించి, తొల్లింటికన్న మిన్నగఁ బురుషోత్తముని యందు భక్తిశ్రద్ధలం దవిలి, చరమజీవితమును భక్తజన సంతానమున కాదర్శప్రాయముగఁ బ్రదర్శించె. జీవితాంతము దనకఁ గారుణ్యసాగరుఁడైన గోవిందుని దివ్యచరణారవిందముల సేవించుచుఁ గాముకభోగముల విడిచి రాగాదివిరహితస్వాం తుఁడై చరాచరజంతువర్గములయం దీశ్వరసారూప్యమును

భావించుచు విగతబంధనుఁడై యపవర్గమును బ్రాపించెను.

నిజ పేదబిడ్డల యార్తస్వరంబున నమృతగీతికల నాలించి పాలించిన జననీజనకులు — నిరుపేదతనమున నిధినాయకత్వమును జూఱలాడిన మహీసురులు — ప్రాఁతపేలికలయందుఁ బసిండిచేలముల తళుకుఁ గాంచి మించిన తృప్తిధనులు — నికృష్టకష్టజలధియందు నానందరమతోడఁ గూడిమాడిన పుణ్యదంపతులు — అతిథులందును, సనదలందును, నార్తుల యెడలను నాత్మసాదృశ్యమును గాంచి కాలగర్భమున విశ్రమించిన యీపుణ్యదంపతుల పూతచారిత్రము భారతజాతి విద్యార్థుల భావిజీవితపరిణామమునకుఁ జేయూత నొసంగి వారిం గృతార్థులఁ జేయుఁ గాక.

అంబరీషుఁడు

పాలనప్రాభవమున భరతఖండమును యశశ్చంద్రికలచేఁ గప్పి ధర్మప్రతిష్ఠాపనమే యవశ్యకర్తవ్యముగఁ బాలించి, మూర్తీభవించిన యార్తత్రాణపరాయణత్వము నాఁ బరఁగు సనాతనరాజచూడామణుల పవిత్రకార్యములు నేఁటికిని లెక్కకు మీఱియున్నవి. అందు సత్యపాలనమునఁ గొందఱు, నాశ్రితరక్షణమునఁ గొందఱు, ధర్మపోషణమున మఱికొంద ఱును భారతజాతికి వన్నెదెచ్చినవారై యశఃకాయమున నివ్వటిలుచున్నారు. వారిలో క్షత్రియకులశిరోభూషణుఁడును, మహావిభవవిరాజితుఁడును, విష్ణుభక్తాగ్రసరుఁడును, సద్గుణ గరిష్ఠుఁడును నై యొప్పిన నంబరీషరాజపుంగవుని చరిత్ర మతి పవిత్రము. ఈతఁడు సత్యవచోధురీణుఁ డని వాసి గాంచిన నభగునిపౌత్రుఁడు. పితృవాక్యపరిపాలనాదక్షుఁడు బ్రహ్మజ్ఞాన పారీణుఁడు నై పరిఢవిల్లిన నాభాగుని పుత్రుఁడు. సప్తద్వీప పరీతభూతల మీతనికిఁ గ్రీడారంగము. వైష్ణవప్రపత్తియే వీని రాజ్యరమకు ముఖ్యాలంకారము. సమస్తవైభవములచేఁ దుల తూఁగు నీమహారాజధికారమదాంధుఁడుగాక, యైహికముల యందు మిథ్యాభావమును బాదుకొల్పి, సర్వావయవములును విష్ణుకైంకర్యమునకు సమర్పణము చేసి, వైదికధర్మములకు నేకొంతయుఁ బాటిలకుండ, ఛాయయై వర్తించు సహధర్మ

చారిణితోఁ గాలము పుచ్చుచుండె. తా నేకార్య మొనరించి నను హరి యని సంభావించు; దర్శించు; ఆఘ్రాణించు; రుచిఁ గొనఁ దలంచు. ఈ తీరున నప్పరమభాగవతశిఖామణి వసిష్ఠాది మునిశ్రేష్ఠులతోఁ గూడికొని సరస్వతీతటమున ననేక వాజి మేధము లొనరించి సంతతభూరిదక్షిణలతో భూసురపరితృప్తిం గావించి మహాతపస్సంపన్నుండై రాజర్షి బిరుదమును గాంచి వెలయుచుండె. ఈచందమున నీశ్వరాయత్త చిత్తమున నవనిఁ బాలించుచుండిన యంబరీషరాజర్షికి వైరాగ్యభావము దినదిన ప్రవర్ధమానమై మిన్నుముట్టుచుండె. దాన నమ్మేదినీకాంతుఁడు హరులందును గరులందును ధనములందును గేళివనలందును బుత్రమిత్రబాంధవానీకములందును నాస్థ వీడి సంసారమువలనఁ దగులంబు విడిచి రాజ్యలక్ష్మిని మంత్రివరులయధీనము కావించి నిర్మలుఁడై యేకాంతంబున,నితాంతభక్తిపరవశుఁడై యుండె. అంతరంగభక్తుం డగు నారాచతపసియోగమహిమకు మెచ్చి భక్తలోకపాలుఁ డగు పరంధాముఁడు వైరిభటశిక్షణంబును, స్వజనసంరక్షణంబును, నిర్వక్రపరాక్రమంబు నగు చక్రాయుధము నొసంగి యనుగ్రహించె.

అనంతర మాపరమభాగవతోత్తముఁ డుభయతారక మగు ద్వాదశీవ్రత మనురూపగుణాఢ్య యగు నాత్మమహిషితో నొక్కవత్సర మొనరింప సంకల్పించి నిర్విఘ్నముగ నిర్వహింపసాగె. ఇట్లు వ్రతంబు సలుపుచు నాదంపతులు కార్తికమాసం బాసన్న మగుడు, వ్రతసమాప్తికై వలయు

పరికరనికరంబులు సేకరించుకొని, మధువనంబునకుం బోయి మూఁడురాత్రులుపవసించి, కాళిందీస్రవంతిని గ్రుంకులిడి, మహాభిషేకవిధానమున శ్రీహరికి నభిషేకము గావించి, నానావిధ స్వర్ణమయమణిభూషణములతోడను బట్టుపుట్టముల తోడను నలంకరించి, మనోహరపరిమళగంధాక్షతలు సమర్పించి, యభినవామోదకుసుమవిసరంబులచేఁ బూజించిరి. తదనంతర మాతండు వెండిగొరిజలును బసిండిశృంగములును గలిగి క్రేపుల నట్టు నాఁకుచు నంగచ్ఛాయలై విలసిల్లి పయోధారల వర్షించునాలమందల నఱువదికోట్లను సదక్షిణంబుగ దాన మొనరించె. సంఖ్యాతీతము లగు భూసురబృందమునకు డెంద మలర మృష్టాన్నములతో విం దొనరించె. భూదేవోత్తము లా రాజ దంపతుల వైష్ణవభక్తి కిచ్చ మెచ్చి వారిడిన చతుర్విధాహారములకు ముద మంది యాశీర్వాదపరంపరలచే వారిని ధన్యులఁ గావించిరి.

ఆ తీరున ద్వాదశీదివసము కొంత ముగిసిన పిమ్మటఁ బుడమిఱేఁడు పారణము సేయ నుద్యోగించు నవసరమునఁ దపస్స్వాధ్యాయసంపన్నుఁడు, రవికోటిప్రతిమాన తేజుఁడు, రుద్రాంశసంభూతుఁడు నగు దుర్వాససంయమి తన్నివాసమున కతిథిగా నేతెంచె. అట్లరుదెంచిన మునివల్లభునకు జనవల్లభుఁ డెదు రేగి సముచితసత్కారముల నాదరించి తోకొనివచ్చి భద్రాసనంబిడి పావనజలంబులఁ బాదములు కడిగి తడియొత్తి నేమ మారసి

తనయింట విందారగింపఁ బ్రార్థించె. అందుల కామునికుంజరుఁ డమితానందమునఁ బొంగి యంగీకరించి కాళిందీసలిలావగాహం బొనరించి క్రమ్మఱ వచ్చెద నని చనియె. కాని పరమధ్యానమునఁ బ్రవృత్తుఁడై బాహ్యప్రపంచమునే విస్మృతిఁగన్న మునికులతిలకుని డెందము విందుసంగతిని విస్మరించె. ఇయ్యది యుక్తమే గదా! యమునాతరంగిణిం దానమాడఁ బోయిన యత్రితనూజాతుఁ డెంతసేపటికిని మగిడి రాఁడయ్యె. ద్వాదశియా ముహూర్తార్ధావశిష్టమై చూపట్టుచుండె. ఈ లోనఁ బారణము సేయకున్న వ్రతభంగము వాటిల్లు. చేసిన బ్రాహ్మణాతిక్రమణదోషము పెనుభూతముక్రియఁ గట్టెదుటఁ బొడకట్టుచుండె. అంబరీషనృపాలుని కడుగులు తడఁబడఁ దొడంగె. కుత్తుక యుత్తరించుకొని పోవుచున్నట్లుండె. హృదయము చలనము మాని స్తంభీభూతము కాదొరకొనియె. లోచనచకోరద్వంద్వము మునిచంద్రునిరాకకై యుత్కంఠతో నెదురు చూచుచుండె. చేయునది లేక యంబరీషుఁడు కర్తవ్యనిరూపణమునకై విద్వజ్జనలోకమును రావించి వారిమ్రోల సర్వమును నివేదించి ధర్మరక్షణోపాయ మనుగ్రహింపుఁ డని వేఁడికొనియె. పదంపడి పండితమండలి తర్కవితర్కమునకుఁ బూనుకొనియె. పూర్వపక్షసిద్ధాంతములతోఁ గొంతప్రొద్దు శాస్త్రగోష్ఠి నెఱపిరి. ఆమంత్రితుం డయినయతిథిని వీడి భుజియించుటయుఁ గాదు. వ్రతోద్దిష్టమైనద్వాదశీపారణము వీడుటయుఁ గాదు. రెంటికిని నడుమ సలిలభక్షణము సమ్మత

మని ధర్మసందేహమును బాపి విద్వల్లోక మనుగ్రహించె. తదనంతర మాభూజాని డెందమున సందియమును మాని హరిపాదసరోరుహము లాత్మ భజియించి నీరపారణంబు చేసి స్నానార్థియై వెడలి కడుఁ దడసిన జడదారిరాకను బ్రతీక్షించుచుండె.

అంతట దుర్వాసుఁ డనుష్ఠానముల నిర్వర్తించుకొని మడుఁగుచేలముతో, మెడ వ్రేలురుద్రాక్షమాలికలతో, భస్మగుంఠితఫాలభాగముతో, నపరశివుఁడుం బోలె దర్శన మొసంగె. అంబరీషుఁడు వినయవినమితగాత్రుఁడై యాత్రమున వంటకము సేయింపఁ దొడంగె. కాని మునిమానసమునకు నంతయు విలక్షణమై కన్పట్టుడు నాంతరదృష్టిని సర్వమును గ్రహించె. అంబరీషుని సలిలభక్షణరహస్యము బట్టబయలయ్యె. తోడనే జడదారిహృదయము క్రోధఘూర్ణితమై తపింపఁ జొచ్చె. పార్థివేంద్రునిహృదయానుతాపంబును, నిర్నిమిత్తముగఁ దటస్థించిన విషమపరిస్థితియుఁ గ్రోధాతిరేకమున రేకెత్తినమునిరాజుచిత్తము గ్రహింపదయ్యె. అతిథియా గౌరవింపఁదగిన మునిసార్వభౌముఁడు. అందును గ్రోధమూర్తి యగు దుర్వాసుఁడు. జరిగినది ధర్మభంగము. చెప్పుట కేమున్నది! రంగమున భీభత్సరసము తొలఁకాడఁ దొడంగె. తపసిరాయఁడు కన్నులఁ గెంపు గదుర ధర్మగ్లానికై హుంకరింపఁ దొడంగె. ఇంద్రుఁడవు చంద్రుఁడ వని కైవారములు సలిపి విందునకుఁ బిలిచిననృపాధమున కింతటి యధికారమదాంధతయా యని

గర్జింపసాగె. ఇందఱును జూచుచుండుఁడు, విష్ణుభక్తుఁడ నని విఱ్ఱవీఁగు నీనృపకిరాతునిగర్వ మడంచెద నని యుచ్చైస్స్వనంబున బొబ్బలిడుచుఁ జిందులుద్రొక్కుచుండె. పాపము రాజేమి చేయఁగలఁడు? విద్వాంసు లేమి యొనర్పఁగలరు? పరమకోపి యగు నాతాపసునియెదుర శాస్త్రచర్చలు, ధర్మనిర్ణయములు పనికివచ్చునా! ప్రార్థనలు క్రోధాగ్నికి నాజ్యధారల వంటివి. అంతకంతకు మునిశార్దూలుని క్రోధానలము ప్రజ్వరిల్లఁ దొడంగె. పరాభవాగ్ని ప్రళయాగ్నిగఁ బరిణమింపఁ దొడఁనే—

చ. పెటపెటఁ బండ్లు గీఁటుచును భీకరుఁడై కనుఁగ్రేవ నిప్పుకల్
పొటపొట రాల గండములు పొంగ మునీంద్రుఁడు హుంకరించుచున్
జట మొదలంటఁగాఁ బెఱికి చక్కన దానన కృత్య నాయుధో
త్కటవలమానహస్తయుతఁగా నొనరించి నయించె రాజుపైన్.

ఇట్లు భయంకరాకారమున వెడలిన మహాకృత్య యనుమొక్కలపురక్కసి యుక్కుమిగిలి కాలానలసన్నిభమైన శూలాయుధమును గేలఁ గీలించి మనుజవల్లభుని భీకరముగఁ దాఁకె. ఔరా! క్రోధ మెట్టి కార్యమునకైన నొడఁబడుఁగదా! అందులకు భక్తిస్వరూపుఁ డగు నంబరీషుఁ డించుకయేని చలనమొందక యీశ్వరధ్యానపరాయణుఁడై నిలిచియుండె. అప్పుడు ప్రేక్షకులు కన్నులు మోడ్చి హాహాకారములు సేయుచుండిరి. సర్వాంతర్యామియై భక్తుఁ డగు నంబరీషుని పవిత్రాంతరాత్మను లీనమై యుండిన పరంధాముఁడు

వెఱ్ఱితపసి చేయు వేడబములఁ జక్కఁబెట్టు మని చక్రాయుధమును బనిచె. అంతటఁ జిమ్మచీఁకటులముమ్మరము నడఁగఁ ద్రొక్కు బంగరుమెఱుంగులఁ దుఱంగలించుచు విష్ణుదేవు చక్రము నిర్వక్రపరాక్రమంబునఁ గృత్యను డీకొనియె. ఉభయశక్తులకును బోరు ఘోరంబగుడుఁ బ్రళయవహ్నిపగిదిఁ బ్రజ్వరిల్లు చక్రధారలను గృత్య సమసిపోయె. అప్పటికిని దాహశాంతిఁ గాకుండుటం జేసి సుదర్శనాయుధము మునివెంట నంటె. మునివల్లభుం డుల్లమునఁ బెల్లుగఁ దల్లడిల్లఁ దొడఁగె. విడుచుటకు శాపోదకములు గావు. కుడుచుటకు ద్వాదశీపారణము గాదు. తిరస్కరించి నోనాడుటకు నంబరీషరాజర్షి కాఁడు. సహస్రధారాకరాళంబై విక్రమించుచక్రానలజ్వాల. కావునఁ దాపసోత్తముఁడు భీతచేతస్కుఁడై కాలికొలందిగ నూడనిం బాడి మేరుగుహ సొత్తెంచె. అదియు నురగంబు వెనుకొను దవానలంబుచందంబునఁ దోన చొరఁబడియె. మఱియు,

మ. భువిఁ దూఱన్ భువిఁ దూఱు, నబ్ధిఁ జొర నబ్ధుల్ సొచ్చు, నుద్వేగియై
దివిఁ బ్రాఁకన్ దివిఁ బ్రాఁకు దిక్కులకుఁ బో దిగ్వీధులం బోవుఁ, జి
క్కి వెసం గ్రుంగినఁ గ్రుంగు, నిల్వ నిలుచుం, గేడింపఁ గేడించు, నొ
క్కవడిన్ దాపసువెంట నంటి హరిచక్రం బన్యదుర్వక్రమై.

ఇంతలోఁ దాపసి కాయాసము హెచ్చె. చేయునది లేక కొందలమందుడెందముతో విశ్వజనవ్యాపారపారీణుఁడగు విధాతను శరణుచొచ్చి కరుణ జూడు మని ముని వేఁడికొనియె. అందుల కానలుమోముల వేలుపు హరిచక్రానలకీలల

నడ్డుకొను సామర్థ్యము తనకు లేదని సూచించుటయే కాక యింద్ర దక్ష ప్రజాపతి భృగు భూతపతులు గూడ వాని యాజ్ఞ జగద్ధిత మని తలఁ దాల్తురు కావున సుదర్శననివారణం బనివార్యంబ యని వచించె. దుర్వాసుఁడు గలఁత నొందినహృదయముతోఁ గైలాసవాసుఁ డగుపార్వతీపతిని దర్శించి చక్రోదంతమును సాంతముగ విన్నవించుకొని రక్షింపవే యని పాదముల వ్రాలె. ఈశ్వరుఁడు వానిదగుదైన్య మవలోకించి "వత్సా! శ్రీహరి జగదాధారుఁడు. కాలానుసారముగ వాని యందుఁ బెక్కువేల జీవరాసులు సృష్టిస్థితిలయము లందుచుండు. అంతియె కాక పద్మగర్భుఁడును నేనుఁ బురందరుఁడును నారద సనత్కుమార కపిల మరీచ్యాదిమహర్షులుఁ గూడ వెడ మాయలఁ దగిలి వర్తింతుము. కావునఁ ద్రిజగన్మోహనమూర్తి యగు వానిచక్రాయుధ ముపసంహరింప నేరము. కావున నోమునీంద్రా! నీ వమ్మహాత్మునే శరణంబు వేఁడుము. ఆతం డొక్కరుఁడ నీకు మేలు సేకూర్పఁగలవాఁ" డని శర్వుఁ డాన తిచ్చె. తోడనే దుర్వాసుని సూక్ష్మదృష్టులు విశాలభూవలయమునంతను జుట్టివచ్చినవి. కాని రక్షణస్థానము గోచరింపదయ్యె. స్వప్రాణసంరక్షణార్థము శ్రీహరియే దిక్కని వెనుకాడుపాదయుగళితో నాతపసి వైకుంఠనగరముం జేరి,

శా. ఆవైకుంఠములోని ధర్మమణిసౌధాగ్రంబుపై లచ్చి దాఁ
గ్రేవన్ మెల్లన నర్మభాషణములం గ్రీడించుపుణ్యున్ హరిన్
దేవాధీశ్వరుఁ గాంచి "యోవరద! యోదేవేశ! యోభక్తర
క్షా! విద్యాపరతంత్ర! మానుపఁ గదే చక్రానలజ్వాలలన్."

"ఓయార్తత్రాణపరాయణా! రక్షింపుము. రక్షిం
పుము. అపారమైన నీదివ్యమహిమ నిక్క మెఱుంగ నేరక
నీ ప్రియభక్తుని కపచారంబు గావించి యపరాధి నైతి. అతిథి
తిరస్కారంబు సహింప నోడి రోషమునఁ జేసినదోషము నాకు
మోస మయ్యె. అంబరీషచక్రవర్తి నీ కింత గూర్చువాఁ
డనియు నచ్చినచుట్ట మనియు మది నెఱుంగక భంగపడితి.
కృపాళూ! దీనజనచింతామణీ! యాగ్రహము వీడి చక్రజ్వాల
నుపసంహరించి యనుగ్రహింపవే" యని దీనాతిదీనముగ
వేఁడుకొనఁ జొచ్చె.

ఇట్లు సాఁగిలంబడి లేవక యున్నదుర్వాసునిం గని
పురుషోత్తముఁడు "తాపసవరేణ్యా! మతిమంతులగు సాధు
వులు నాహృదయము సొచ్చి రహస్య మెఱిఁగి భక్తిలతా
పాశంబుల నేర్పు మెఱయ నన్నుఁ బంధించివైచెదరు. దానం
జేసి నిగళబద్ధ మగు మదకరీంద్రమువడువునను కోడెను వీడఁ
జాలని గోవుభంగిని భక్తుల వెనుదవిలియుందు. ఆలిని సంప
దాలిని గూడ విడిచి, తనువు రోసి, తనయులను జుట్టాలను
బాసి, సర్వమునకు నేనె దిక్కని నమ్మి వర్తించుభక్తజనము
లెట్టివార లైనను వారిని బోనాడ నేర. సాధులహృదయము
నాసదనము. నాహృదయము సాధువులయధీనము. నేను
సాధుజనుల నెఱుంగుదు. సాధులు నా చరిత మెఱుంగుదురు.
మే మనన్యగతికులము. నాభక్తసంతానములయందు నాతే
జము పూర్తిగ మూర్తిభవించి యుండు. నీవు భూసురోత్త

మాఁడ నయ్యె వంశార్హంబైన సత్వగుణమును బోనాడితివి. బ్రాహ్మణోత్తములు తపము విద్య యనుదివ్యసాధనములవలన నుత్తమగతులను బొందుచుందురు. ధూర్తు లగువారల కడెంకును నార్తికరము లయ్యెడు. తేజోవంతులగు నాభక్తుల కెగ్గొనరించినవా రెంతటివారలేని వినాశ మందకపోరు. నీ వీయపరాధమునకుఁ బాత్రుఁడవైనవాఁడవు. కావున నిన్ను వెన్నాడుచుండిన చక్రకీలావళిని మగిడింపనోప. నీయాపదను దొలగించి ప్రోవఁ జాలినవాఁడు సదయుఁ డగునాభాగసుతుఁ డొక్కరుఁడ. అన్యుఁ డెంతవాఁ డేని నేరఁ'' డని వచియించి యూరకుండె. శ్రీవల్లభుఁడె యీతీరున నానతిచ్చినతఱిఁ జక్రకీలాజాలజనితాయాసుఁడగు దుర్వాసునకు భద్రస్థాన మెక్కడిది? సత్యలోకము మొదలు సమస్తలోకములు నిరస్తమైనపుడు నిలువ నీడ యుండునా? త్రిమూర్తుల కందఁగారాని యంబరీషుని భక్తిప్రభావ మేమని కొనియాడఁదగు? తీవ్రక్రోధమునఁ దిరస్కరించి కాలఁదన్నినవాఁడు తానె యంబరీషుని పాదములపైఁ దలయొగ్గ వలసి వచ్చెం. ఔరా! యీశ్వరసంఘటన మెంత విచిత్రమైనది?

తోడనే ముని కృపాసముద్రుఁడును, మంజుభాషుఁడును నగునంబరీషుని సమీపించి జితోస్మి యని పాదము లంటి క్షమియింప వేఁడుకొనియె. పాదములపైఁ బడినమునిరాజును గాంచి యంబరీషభక్తుని మానస మెరియ సాగె. కరుణారసపూరితహృదయుఁడగు నమ్మేదినీకాంతుఁడు కంపితగాత్రుఁడై

తోడ్తోన కృతాంజలియై "నిర్వక్రపరాక్రమమున విక్రమించు నోచక్రాయుధమా !

సీ. నీవ పావకుఁడవు నీవ సూర్యుండవు నీవ చంద్రుండవు నీవ జలము
నీవ నేలయు నింగి నీవ సమీరంబు నీవ భూతేంద్రియ నికరములును
నీవ బ్రహ్మంబును నీవ సత్యంబును నీవ యజ్ఞంబును నీవ ఫలము
నీవ లోకేశులు నీవ సర్వాత్మయు నీవ కాలంబును నీవ జగము
నీవ బహుయజ్ఞభోజివి నీవ నిత్య
మూలతేజంబు నీకు నేమ్రొక్కువాఁడ
నీరజాక్షుండు చాల మన్నించునట్టి
శస్త్రముఖ్యమ కావవే చాలు మునిని.

శ్రీహరి కరప్రయుక్తమై విజృంభించు నీసంచారవేగ మప్రతిహతంబై లోకాపకారు లగుదుష్టరక్షోవీరులకు గుండె తల్లడ మొదవించుటయే కాక, యార్తులగు శిష్టజనంబుల రక్షించుటయుఁ జేయ నగు. నిద్రాసక్తమగు రక్కసిపిండు నీకలరూపు స్వప్నగతం బగుడు, శయ్యాతలంబున నిదురించు తమయిల్లాండ్రు ప్రభాతవాతపోతములకుఁ గలవరము చెంది పలవరింప, నిర్యాణమును జెందు. నీయఃస్తోకసంరంభముడిగించి యాపన్నుఁ డగునీతపసిరాయనిఁ గాపాడుము. నీదివ్యతేజమునకు జోహారులు. శాంతించి భూసురప్రాణసంరక్షణము గావింపుము. వెండియు నేను ధర్మమార్గరతుండ నేని, ధరణీదేవోత్తమునకు దేవతార్హ మగుభక్తి నెఱపితి నేని, యీవిప్రునకు శుభం బొనగూరెడుఁ గాక ! సృష్టిస్థితిసంహారకారణుఁ డగు

దామోదరున కాంతరంగభక్తుఁడ నగుదునేని భూమీసురుఁడు నిరపాయుఁడై నివ్వటిల్లెడుఁ గాక" యని ప్రార్థించె.

ఇమ్మాడ్కిఁ దనకు వేఁడుకోలు పచరించునరనాథోత్తము మన్నించి, తపసిని దయ దలఁచి కాచి విడిచి, దివ్యచక్రము తిరోహిత మయ్యె. రాహుగ్రహవిముక్తుఁడైన రాకాచంద్రుని చందమున మునీంద్రుఁడు కలఁక దేఱి యంబరీషరాజర్షి నుద్దేశించి ప్రసన్నాంతఃకరణంబున దీవించుచు "భళిరే? నరనాథోత్తమా! నేఁ జేసిననేరమును గూరిమిఁ గాచి ప్రోచితివి. నీసాధుశీల మే మని కొనియాడ నేర్తు? హరిపాదాబ్జము లింతముట్టఁ గొలిచిననీభక్తిప్రభావ మనన్యసులభమైనది. మంగళతీర్థపాదుని దేవదేవేశుని నిట్టియకలంకస్థితిని భజించు భక్తావతంసునకు ధారుణీతలమున నందగారానిఁ భద్రంబు లుండునా! జగదాధారుఁ డగుశ్రీమన్నారాయణదేవుఁడు నీరూపమున విశ్వంభరావలయమున నిండి వెలుఁగొందుచున్నాఁడు. ధన్యాత్ముఁడ నైతి" నని యభినందించి యిట్లనియె.

మత్త. "తప్పు లోఁగొని చక్రపావకదాహముం బెడబాపితా
నొప్పు నొప్పు భవద్దయారస, మోసర్వేశ్వర ప్రాణముల్
సెప్పవున్ మను వోయి క్రమ్మఱఁ జేరె, ధన్యుఁడ నైతి, నీ
కెప్పుడున్ శుభ మేను గోరెద, నింకఁ బోయెద భూవరా."

ఈతీరునఁ బయనం బగుమునితల్లజునిఁ గాంచి భూవల్లభుఁడు పాదములకుఁ బ్రణమిల్లి "తాపసాగ్రణీ! నాయింటఁ

గుఱిచి నన్ను ధన్యాత్మునిం జేయవే" యని వేఁడుకొనియె. వెండియు నిరాకరించుటకు జడదారికి ధీరత్వ మెక్కడిది ? చక్రధ్వానము లింకను శ్రవణపుటంబునఁ బ్రతిధ్వనించుచునే యుండె. మాఱుమాటాడక యమ్ముని రాజిడుమృష్టాన్నమును భుజించి తృప్తుఁడై 'నీపావనచరితామృతగీతమును భూమ్యాకాశములు బ్రతిధ్వనించుక్రియ మర్త్యామరులు గీర్తించిముక్తిప్రదులయ్యెదరు కావుత' మని యాశీర్వదించి యింటితెరువున బ్రహ్మలోకమును బట్టి పోయె. పిదప రాజు హృషీకేశునకుఁ దనపయిం గల యవ్యాజానురాగమున కక్కజ మందుచు నతిపవిత్ర మగుభూసురభుక్తశేషమును భుజియించి వత్సరావధికం బగువ్రతమును ముగించి తరించె.

తదనంతర మానరేంద్రుఁడు సంసారం బసార మనిరోసి, ప్రాజ్యం బగురాజ్యంబును సుగుణమహితు లగుసుతులకు నొప్పగించి, తపోవనంబునకుం జని హరిభక్తిపరాయణుండై తపం బొనరించి, దేహాంతరమున విష్ణుసాయుజ్యమును బడసె.

భూతలేంద్రుఁడై దివ్యచారిత్రమునఁ ద్రిమూర్తులను మఱపించి బ్రాహ్మణశాపమును గూడఁ దృణీకరించి ద్విగుణీకృతనిర్మలకీర్తిచంద్రికాసారమున భారతక్షేత్రచారిత్రమునకు వింతమెఱుఁగు లిడి చిరయశంబు స్థాపించి యస్తమిల్లిన నాభాగసుతునికథావిధానము దృక్పథమున నిడుకొనివర్తించు విద్యార్థులజీవితాశయములు సఫలీకృతములు గాక మానవు.

శ్రద్ధాళువులై దీనిం బఠియించువిద్యార్థుల కీఫలశ్రుతి శ్రవణానందసంధాయకమై కామితార్థము లనుగ్రహింప నోపు.

క. ఈయంబరీషుచరితముఁ
దీయంబున విన్నఁ జదువ ధీసంపన్నుం
డై యుండును భోగపరుం
డై యుండును నరుఁడు పుణ్యుఁడై యుండు నృపా.

ధ్రువుఁడు

సుశ్లోకు లగుపుణ్యమూర్తుల పూతచారిత్రములే భాషా వధూటికలంకారములు. వారిసత్ప్రవర్తనాదికములే యువజన ప్రకరంబుల ధార్మికజీవనోన్నతి కాదర్శములు. వారి శుభ్ర కీర్తిని బరిపోషించుటయే లోకకళ్యాణము. గాఢాంధకారమునఁ బ్రాఁకులాడు పాంథజనాళికి విద్యుల్లతాప్రభలవలె, సంసార యాత్రాపరులకు వారిపావనచారిత్రములు మార్గదర్శకము లైన దివ్యదీపికలు భరతఖండము ముందుఁ జెందఁగల యశో న్నత్యము విద్యార్థిలోకము సత్ప్రవర్తనము ననుసరించియుం డును. పూర్వులగు మహాపూరుషులసచ్చరిత్రములఁ బఠించుట కంటె దానికి వేఱుశరణ్యము లేదు. వానిలో ననమాన తేజః పుంజమునఁ బ్రకాశించు రాజచంద్రుల దివ్యచారిత్రములు లేఁ బ్రాయమున విలసిల్లు డింభకులజీవితవికాససౌధవీథికిఁ బునా దులు. మహాపూరుషులదివ్యకథామృతము దనివారఁ గ్రోలి సుఖించిన నర్భకులజీవితపరిణామము లోకమంగళమునకు నిదా నము. ఆత్మగౌరవమునకై శైశముననే శరీర మర్పించి యశము గాంచి మించినబాలభక్తుని యద్భుతచారిత్రము తరు ణవయస్కులకుఁ గర్ణపేయము గానోపు. ధ్రువుఁ డనుపేరఁ బరఁగురాజకుమారవీరుని శుభ్రచారిత్రము పఠియింపని బాల విద్యార్థులు తమజాతీయజీవితసత్త్వమును వమ్మొనరించుకొని రనియే భావింప నగు.

లోకోద్ధరణమునకుఁ జంద్రధరకళాకలితుండై జలజగర్భున కుద్భవించిన స్వాయంభువమనువు ధ్రువునిపితామహుఁడు. సుభగచారిత్రుఁ డగునుత్తానపాదుఁ డనురాజోత్తముఁడు వీని ప్రియజనకుఁడు. ఉత్తానపాదుఁడు సునీతి సురుచి యనునిర్వురుచేడియలఁ బరిణయమాడి భుజపీఠి నలంకరించిన ధరాచక్రమును సర్వజనరంజనంబుగఁ ద్రిప్పుచుండె. అద్ధరాత్రలేంద్రుఁడు న్యాయమార్గమునఁ బాలించుచున్నను గళత్రముల యెడ మాత్రము సమభావము వహింప నోపక "ప్రమాదో ధీమతామపి" యనునార్యోక్తికి గుఱి యయ్యె. రెండవభార్య యగు సురిచితోడిదే లోక మని విశ్వసించి సర్వదా యామెకు వశవర్తియై మెలఁగుచుండె. అవ్విధంబునఁ బ్రవర్తించురాజపుంగవుని భార్య లిరువురును గర్భవతులై పూర్ణచంద్రునిఁ దిరస్కరించుబుడుతలఁ గాంచిరి. కాలకర్మవశంబున సునీతిసుతుం డగు ధ్రువునియెడలఁ గూడ రాగమును వీడి యాఱేఁడు సురుచికొమరుం డగునుత్తమునియందే చిత్తము హత్తించుకొని వర్తించుచుండెను. రాజానుగ్రహంబునకుఁ బాత్రంబైన సురుచి గరువతనంబున మురియుచుఁ దనయందును దనయనుంగుబిడ్డయందును మాత్రమే నృపునిడెంద మానందకందళిత మగునట్లు నయగారము లుపచరించుచుండె. లోకపాలుని ప్రేమావలోకనము దనపై లేకున్న మానెఁ, దనూజాతునియెడఁ గూడ లేకపోయెనే యని సునీతి పెద్దయుం బ్రొద్దు వగచుచుఁ గాలము గడపుచుండె.

ఆద్ధరావరకుమారు లిరువురు దినదినప్రవర్ధమాను లగు చుండ, ధ్రువుఁ డయిదేండ్ల ప్రాయమువాఁ డయ్యె. కొండొక నాఁడు భూవిభుం డుత్తమునిఁ దనతొడపై నిడుకొని యుప లాలనము సేయుచు సురుచిం గూడి వినోదలీలలఁ దేలియాడు చుండె. అందందు ఖేలనాయత్తచిత్తమునఁ దిరుగాడుధ్రువుం డచ్చటికి వచ్చి యామువ్వురం గాంచె. తోడనే తాను గూడ జనకునియంకభాగమునం దధివసింపవలయు ననెడి కుతూహలము డెందమున సందడింపఁ దండ్రిమ్రోలఁ జిందు లాడఁ దొడంగె. సప్రేమదృష్టులఁ దండ్రిపై నిగిడించుచుఁ దదంకారోహణాపేక్షచేఁ జిఱుముడివడుచు బాలమృణాళ కాండములం బోలుమృదుహస్తముల నాడించుచుఁ, జూవులం దీనత్వంబు దోఁపఁ దిలకించుధ్రువునిఁ గాంచియు నాదరింప కుపేక్షించిన విభునిచేఁతలకు గర్వించి సవతికొడుకు నుద్దేశించి సురుచి యిట్లు లనియె.

"ధ్రువా! నీసంభ్రమంబునకుఁ గారణ మూఁరసితి. తండ్రిగారియూరుభాగమును జేర నర్హుండవేని నాగర్భమున నే జనియించియుందువు. సవతిగర్భమున నుద్భవించినయభాగ్యు నకుఁ దండ్రితొడపై నెక్కుభాగ్య మెక్కరణి లభియించు? కొఱనోములు నోచిన నీ వేడ? తండ్రియంక మేడ? అయి నను నట్టికోర్కె గాఢముగ జనియించెనేని యధోక్షజునిపాద రాజీవముల నాశ్రయింపుము. కరుణాసింధుం డగుభక్తమం దారుఁడు వెండియు నిన్ను మదీయగర్భంబునఁ బుట్టించు."

ఇట్లు మర్మములను దూలించు పినతల్లి దుస్సహవచనములఁ జెవులార వినియు జనకుఁ డోదార్చకుండె.

ధ్రువుండు పసిపాప యైన నాత్మగౌరవమున శతవృద్ధుం దిరస్కరింపఁ గలవాఁడు. జనకునిసన్నిధానమునఁ దనయీడు పాపఁ డగుసోదరునిముంగల సవతితల్లి యాడెడు దుర్భాష లాతఁడు సహింపఁ జాలఁ డయ్యె. అభిమానధనుఁ డగు నబ్బాలవీరుఁడు దండతాడితభుజంగంబువోలె మండిపడఁ జొచ్చె. పరాభవాగ్నిచేఁ బ్రజ్వరిల్లు పంచాబ్దంబుల బాల పంచాననునినేత్రములకు శోకదేవత స్వాగత మిచ్చె. చేయు నది లేక పెద్దపెట్టున రోదనము సేయుచుఁ గ్రోధానలజ్వాలికల నుపశమింపఁజేయు కన్నీరోడికలు గట్టి గండభాగమునఁ బ్రవ హింపఁ బరుగువాఱుచు నాతఁడు దల్లిని సమీపించె. వనవి వనవి యేడ్చుచుఁ జెంతఁ జేరిన కుమారశేఖరుని నాపె జేరఁ దిగిచి యొడిలో నిడుకొని మోము నివురుచుఁ జుబుకంబు పుణుకుచుఁ బరిదేవనకారణ మారయుచుండునంత, నతఃపుర పరిచారికాజనంబులు సమీపించి యయ్యుదంతము సాంత ముగ నాపెకు నివేదించిరి. సవతియీసడింపులు వినినయంతనే సునీతిదేవికి హృదయకుహరము వ్రయ్యలై శోకస్రవంతి పాయలై ప్రవహింపఁ దొడంగె. నిట్టూర్పులెగయఁ జొచ్చె. సవతి యాడిన సుండుమాటలు సారెసారెకుఁ దలంపునకు రా గోడుగుడుచుచు దుఃఖాగ్నిశిఖలచేఁ గసుగంది వన్నె దఱిఁగిన మాధవీలతికవోలె నాపె జూపట్టుచుండె. ఇవ్విధంబునఁ గొంత

వడి వాపోయి పొంగిపొరలు శోకస్రవంతిని భావసముద్రమున సంగమింపఁ జేసి ధ్రువునిదీనాననమును విలోకించి యిట్లు లనియె. "ముద్దులపట్టీ! ఊఱడిల్లు మూఱడిల్లుము. శోకము వలనం బ్రయోజన మేమి? జీవసంతతికిఁ దొల్లింటి కర్మఫల మనుభవింపక తీరదు. వారివారి కర్మసూత్రములఁబట్టి మనుజులు శుభాశుభ ఫలముల ననుభవించుచుందురు. వేయేల! నీవు దైవోపహతుండ వగుటంజేసి కాదె భర్తచే నికృష్ట దాసిగా నైనఁ బరిగణింపఁబడని నిర్భాగ్యకుక్షి నుదయించితివి. కావున సురుచిమాటలకు వెతఁ గుందఁ దగదు. తండ్రి చేష్టలకుఁ దల్లడిలను గూడదు. ముమ్మాటికిని నేను దురదృష్టవంతురాలను. నీవో హతభాగ్యుఁడవు. వత్సా! దురపిల్లకుము. పినతల్లి యైన సురుచివచనంబులు సత్యంబులే యగు. ఇంకను జనకుని యంకభాగముపై నిశ్శంకముగ వసియింపఁ గాంక్ష గలదేని, సురుచియాదేశము ననుసరించి సర్వశరణ్యుం డగు హరిచరణము లాశ్రయింపుము. దాన సకలశుభంబు లొదవుటయే గాక నీమనోభీప్సితంబును సిద్ధించెడు. విపదంబుధిని మునింగి దరి గానలేని దుఃఖభాగులకుఁ బరంధాముని పదసేవయే నావ. మఱియు విశ్వంభరాపాలనమునకై పద్మగర్భుఁడు నారాయణుని పాదనలినముల సేవించి బ్రహ్మపదంబు నందె. సర్వాంతర్యామి యగు నమ్మహాత్ముని కరుణారసవృష్టి కతంబున ఘనుఁడు మీతాత నిరవధికయోగఫలంబుల ననుభవించి ప్రఖ్యాతయశుండై యిహపరంబులఁ జూఱగొనిన

వాఁడు. నీవు గూడ నారమాకాంతుని పదపంకేరుహంబులకుఁ బ్రణమిల్లి సల్లలితప్రతాపుండవు గమ్ము." పరమార్థప్రతిపాదకంబు లగు తల్లివాక్కులయందు గుఱి నిల్పి ధ్రువుం డామె వలన నాశీర్వాదముల నంది యరవిందగర్భముఖగీర్వాణులకును లక్ష్మీతరుణీమణికి నన్వేష్టవ్యుఁ డగు పరమేశుని నన్వేషించి సేవించుటకై గహనాంతరసీమలకుఁ బయనం బగుచుండె. బాపురే! పరాభవానలమున మ్రంది కుందు పసిపాపలు ధీరస్వాంతు లగుటకై ప్రోత్సహించి ప్రఖ్యాతయశోవల్లరులచే జీవితకుసుమములఁ బిసాళింపఁ జేయు వీరమాతల ధీరవృత్తి నెం తని కొనియాడఁ గలము ?

అత్తఱిఁ జతుర్దశభువనసంచారియుఁ ద్రికాలసంవేదియు నగు నారదమౌని సర్వ మెఱింగి మధ్యేమార్గమున నబ్బాలకుని సమీపించి సకలపాపనాశనకరం బైన తనహస్తంబున ధ్రువుని మస్తక మంటి మానభంగము సహింపని క్షత్రియార్భకుల ప్రభావమున కక్కజ మందుచు నబ్బాలు నుద్దేశించి యిట్టు లనియె. "ఓయీ! రాజార్భకా! ఎందుల కీసాహసము! నిత్యలక్ష్మీనివాసమై తనరునావాసమును వీడి త్రిదివసదృశంబు లగు మహైశ్వర్యములఁ బాసి యేకాకివై కాంతారములఁ బరిభ్రమించి శ్రమంపడ నేల? సంరంభ ముడుగుము." అనవుడు ధ్రువుండు హృదయవిదారణము లగు సపత్నీమాతృపరాభవానలదారుణకీలల నీశ్వరానుగ్రహసుధారవృష్టిం జల్లార్చుకొనఁ జూదు నని దేవమౌనికి విన్నవించె. నిర్భరానందమును నుగ్గ

డించు నబ్బాలభక్తుని యుక్తుల కలరి నారదుం డిట్టు లనియె. "ఓహో! బాలకా! నిరంతరము బాలక్రీడల వర్తించు లేఁబ్రాయమున మానావమానవిమర్శన మేల? ప్రాణుల కాత్మీయకర్మఫలంబు లయాచితంబుగఁ బ్రాప్తంబు లగు. అవ్వానికై విజ్ఞు లగు పూరుషులు ఖేదమోదంబుల నరిగఁ బొందుదురు. అదియునుం గాక మాతృనియోగానుసరణంబుగ సర్వేశ్వరానుగ్రహంబునకుఁ బాత్రుండ నగుదు నంటి వేని, జన్మపరంపరాగత వాసనలతో నిష్కామకర్మమున సమాధినిష్ఠల దీపించు యోగీంద్రు లేని యందఁగా రాని పరంధాముని నేక్రియఁ బొందనేర్తువు? వాని నారాధించి కనుంగొనుట కష్టైకసాధ్యము. కావున నీయుద్యోగమును వదలి వివేకమతి వయి తండ్రికడ నిలిచి దైవప్రసాదము లని కలిమిలేముల స్వీకరించి విమల విజ్ఞానవర్తివై వర్తింపుము." గుణాఢ్యుని గాంచి యానందించుచు నభాగ్యుం డగువానిదెసఁ గరుణ చూపుచు సమునితో మైత్రి నెఱపి వర్తించువానిని దాపత్రయాదికము లంట నేరవని బోధించు మానివరేణ్యుం గాంచి ధ్రువుం "డనఘా! యంతటిశాంతిపథంబు సుఖదుఃఖోపహతులకు సిద్ధింప నేరదని కృపాలుఁడ వగునీవలన వింటి. నేనుత్తమక్షత్రియవంశ సంజాతుఁడ. సురుచి యాడిన దుర్భాషాఘనశరంబులు హృద్గతములై కరంబు కాఱియవెట్టుచున్నవి. దానం జేసి మదీయ చిత్తశాంతి స్థానభ్రంశము నొందె. మునీంద్రా! త్రిభువనోత్కృష్టమై యనన్యసాధ్యంబై యొప్పు సాధుమార్గ మెఱిగించి

తరింపఁ జేయుము. బ్రహ్మయూరువున జనించి యంచితవిపంచీ వాదనకుశలుండవై లోకకళ్యాణమును గాంక్షించి యర్కుని చందమునఁ దిరుగుచుందువు. నీ వెఱుంగని ధర్మరహస్యంబు కలదే?" యని ప్రార్థించి మిన్నకుండె. ధ్రువుని డెందము నందలి శుభప్రారంభము మేరుభూధరముక్రియ సుస్థిరం బని తలంచి మునివరుం డాతని గాంచి "కుమారవీరా! నిన్నీమార్గమునకుఁ బ్రేరేచినవాఁడు దీనజనమందారుం డగు నారాయణుఁడు. సకలపురుషార్థములఁ గోరు పూరుషునకు హరిపాద సరోజయుగళంబే శరణ్యంబు. యమునానదీతీరంబున మధువనంబు హరిసంచారంబుకతమ్మునఁ బవిత్రమ్మును బుణ్యప్రదమ్మునై యలరారుచుండు. నీ వందుల కేగి యా శైవలినీ పావనతోయంబులఁ గ్రుంకులిడి హరిపదధ్యానప్రవణ చిత్తుఁడవై యమ్మహాత్ముని భజియింపుము. నీ వనుపవీతుండవగుటం జేసి వేదాధ్యయనాద్యుచితకర్మంబుల కనర్హుండవు. అయిన నయ్యది భక్తిమార్గావలంబుల కవరోధ మొనంగఁజాలదు. కల్పితాస్తరణుండవై స్వస్తిప్రముఖాసనోపవిష్టుండవగుచు ధ్యానపరాయణుండవు గమ్ము. మఱియు నాశ్రితవత్సలుండు సుందరహరినీలసన్నిభాంగుండు శ్రీవత్సలక్షణలక్షితుండు లలితకాంచననూపురాలంకృతుండు సర్వలోకశరణ్యుండుఁ బీతాంబరధరుండు నగు శ్రీహరి నీకు దర్శనీయుండు. పరమనివృత్తిమార్గమున లభ్యం బగు పురుషోత్తముని దివ్యమంగళస్వరూప మొక్కపరి చిత్తమున హత్తెనేని మగుడ

వెనుదిరుగ నేరదు. ప్రణవయుక్తంబును ద్వాదశాక్షరకలితంబును దేశకాలవిభాగవేదియు నై బుధానుష్ఠితం బగు వాసుదేవమంత్రం బొందు గలదు. అమ్మంత్రరాజంబును సప్తవాసరంబులు పఠియించినమాత్రమున ఖేచరాలిం గనుంగొను సామర్థ్యం బలవడు. మాయాభిభూతులు గాక సేవించువారికి సర్వాభిమతార్థసంసిద్ధి యయ్యెడు" నని తద్రహస్యముల నెల్ల నామూలాగ్రముగ నుపదేశించె. అందుల కానునీతినందనుఁడు డెందమున హర్షాంబుధి నోలలాడి నారదమునీంద్రునకుఁ బ్రదక్షిణపూర్వకనమస్కృతు లొనరించి వానిచే ధన్యవాదములం బడసి మునిజనసేవ్యం బగుమధువనంబునకుం బోయె.

అనంతర మానలినసంభవసంభూతుఁ డుత్తానపాదనరేంద్రుని సమీపించి వానిచే సముచితపూజనములం బడసి సంప్రీతచిత్తుండై మార్గపరిశ్రాంతి నపనయించుకొనువాఁడుం బోలె కొండొకవడి నిలిచి యంతట జేనివంకఁ దిరిగి యాతని మొగము చెన్ను దఱిఁగి యుండుటం జూచి తత్కారణ మారయఁ గోరె. సుపుత్రునివియోగక్లేశభరమున నుత్తలమందున్నృపుచిత్తము మునీంద్రుని యుపలాలనంబుకతంబున ద్రవీభూతం బయ్యె. బాష్పవారి దృష్టినిరోధం బొనరించుచుండె. డగ్గుత్తికతో రాజు మునిరాజుం గాంచి "మౌనివర్యా! ఏమని వాకొన నేర్తు? పరితాపకారణ మెట్లుగ్గడింతు? సుగుణాలవాలుఁ డగుబాలుఁడు సరససద్గుణసాంద్రుఁడు పంచాబ్దములవాఁడు మదీయతనూజాతుఁడు మందబుద్ధి నగునాచేతి

పరాభవమునకుఁ దాళనోడి యడవులఁ బట్టి పోయె. మనః క్లేశకలితుఁడై, క్షుధానలపీడితుం డయి ఘోరాటవులం గ్రుమ్మఱు నాపసికూన భయంకరవ్యాఘ్రభల్లూకాదివన్యమృగ శ్రేణివదనగహ్వరములనుండి వెండియు బయలువెడలునే? మునికులతిలకా! అంగనాసక్తచిత్తుఁడనై యుత్తమోత్తముఁ డగునబ్బాలుఁ డంకపీఠి నధివసింప రా నిరాకరించి భంగపడిన వెంగలివిత్తును. అక్కటా! మదీయదురాగతమునకు మేర గలదే?" యని వాపోవఁ దొడంగె. అత్తెఱంగున దిగు లొందు వగఁగుందు నరనాథునిం గూర్చి నారదుండు "రాజేంద్రా! వగవేల? ఊఱడిల్లుము. నీచేఁ బరిభూతి నందిన ప్రియనందనుఁడు మందుండు గా నోపఁడు. అతఁడు రాజీవ దళాక్షునిచే రక్షితుఁడై సుద్రువం బగుకీర్తివిభవంబుచేఁ దేజ రిల్లఁగలవాఁడు. తులసీదళదాముని భజియించి లోకపాలుర కందఁగారాని నిత్యపదంబునఁ బ్రభుశ్రీలతో విలసిల్లు. శోకం బుడిగి సుఖంబుండుము. కతిపయివాసరంబుల కాసుగుణ రత్నాకరుం డిటకు సురక్షితుండై రాఁగలవాఁడు. వైశంబ శుభంబు నేకూరెడు గావుత" మని యాశీర్వదించి ముని పనివినియె. పిమ్మట నాభూకాంతుఁడు పదింబదిగ నారదు వచనప్రకారమును దలపోయుచు రాజ్యకాంక్షను వీడి ప్రొద్దులు పుచ్చుచుండె.

అట ధ్రువుండును నారదప్రబోధితుండై దేవమాని వర్ణితంబును సమస్తపుణ్యనిలయంబును నై యొప్పారుమధు

వనంబు డాయంజని యమునాతరంగిణిని గ్రుంకులిడి సమాహితచిత్తమున ధ్యానసమాధి ప్రవేశించె. ప్రారంభమున నాతఁడు త్రిరాత్రోపవాసంబు లొనరించుచుఁ గపిత్థబదరీఫల పారణంబునఁ బ్రాణధారణము గావించుకొనుచుఁ బ్రథమ మాసము హరిధ్యానమునఁ గడపె. రెండవమాసంబున నాఱేసి దివసంబుల కొకమాఱు జీర్ణతృణపర్ణాహారుండై విష్ణుసమారాధనం బొనరించె. పిమ్మట నవరాత్రంబుల కొకపరి సలిల భక్షణంబు సేయుచు మూఁడవనెల మాధవు నర్చించె. చతుర్థమాసంబున ద్వాదశీదివసంబుల కొకతోయము వాయుభక్షణము గావించి జితశ్వాసుండై పుండరీకాక్షునిఁ బూజించె. పంచమమాసమున నిరుచ్ఛ్వాసుండై చేతనారహితం బగుస్థాణువు క్రియ నేకపదంబున నిలిచి పరమాత్ముని సేవించె. పదంపడి యాతఁడు విషయవాంఛలకుఁ జోటీయక జగదాధారుం డగునారాయణుండే శాశ్వతపరబ్రహ్మం బని హృదయపీఠిని బాదుకొల్పి తదన్య మెఱుంగక హరిస్వరూపమున లీనమై యుండె. అబ్బాలకునియంగుష్ఠపీడనమున భూరిమద వారణాధిష్ఠితంబై సాగరతరంగమాలికల నూఁగాడుపోత మట్లు ధారుణీతల మల్లలనాడఁ దొడంగె. ముల్లోకవాసు లుఱ్ఱూఁతలూఁగిరి. చరాచరాత్మకం బగు ప్రపంచమునంతను గర్భకుహరమున దాఁచుకొనిన రమానాథుఁడే ధ్రువునితపోబలంబునఁ జలనమందిననాఁడు తక్కుంగలవారియిక్కట్టులు లెక్కింపనేటికి? ప్రాణనిరోధంబున దేవతానీకము తాళఁజాలక భగ

వాసుని జేరి ముకుళితహస్తులై "ప్రభూ! శరణార్థులము. ఆర్తి హరించి కావవే" యని మొఱవెట్టఁ దొడంగె. శ్రీహరి వారియెడల సుప్రసన్నుండై తత్కారణము సర్వ మెఱింగించి కుందు వాపి వారి వారియావాసంబుల కంపి గరుడవాహనారూఢుండై మధువనంబునఁ దపం బొనరించుధ్రువుని యెదుట సాక్షాత్కరించె.

అంతి ధ్రువునిమనోంబుజమునఁ దాండవమాడుకోటి త్ప్రభాయుతమూర్తి తిరోహితుం డయ్యె. భక్తావతంసుని నేత్రద్వంద్వము చలన మందె. తోడ్తోన యతని ప్రఫుల్లనయనప్రసారము కట్టెదుట నిలిచినవై జయంతీమాలికాశోభితునిపై, చతుర్భుజునిపైఁ బ్రసరించె. అంత నాతఁ డుత్తరక్షణముననే యమ్మహామూర్తికిఁ బ్రణమిల్లి కృతాంజలియై యవ్విరాడ్విగ్రహుని స్తుతియింపఁ బ్రయత్నించి స్తుతిక్రియాకరణదక్షుండు గానేరక నివ్వెరపాటుతో నిలిచి వీక్షించుచుండె. అక్కు లెఱింగినబాలగోపాలమౌళి వేదమయం బగుశంఖమున నిర్భరానందముతో నయ్యర్భకునికపోలతల మంటె. తోడనే గంగాఝురీసంకాశం బగు స్తోత్రస్రవంతి బయలువెడలె. దానంజేసి యబ్బాలభక్తుండు శ్రీకాంతు నివ్విధంబున వినుతింపఁ దొడఁగె.

"దేవాదిదేవా! నీవు సర్వభూతాత్ముండవు. లోకవృత్త మంతయు భవదీయేచ్ఛామాత్రంబున వర్తించుచున్నయది. సమాధినిష్ఠం బడలినయింద్రియాళిని నీయూర్పుగాడ్పుల నుజ్జీవింపఁ జేసినజగత్ప్రాణుఁడవు. దీనబంధూ! దాసుని

వందనము లందికొనుము. ఏకేశ్వరుండ వయ్యు మాయాఖ్యం బగునా త్రీయశక్తిం జేసి దారువులయందలి వహ్నిచందమున వివిధరీతులఁ బ్రకాశించుచుందువు. సకాము లయినదీనులను గోవత్సన్యాయమునఁ బోషించునీకృపావిశేషం బే మని కొనియాడ నేర్తు!

మ. అరవిందాదర తావకీనచరణధ్యానానురాగోల్లస
చ్చరితాకర్ణనజాతభూరిసుఖముల్ సానందకబ్రహ్మమం
దరయన్ లే వఁట. దండభృద్భటవిమానాకీర్ణులై కూలు నా
సురలోకస్థులఁ జెప్ప నేల సుజనస్తోమైక చింతామణీ.

చ. హరిభజనీయమార్గనియతాత్తకులై భవదీయరూపమై
వఱలినభక్తియుక్తు లగువారలసంగతిఁ గల్గఁజేయు స
త్పురుషసుసంగతిన్ వ్యసనదుర్భరసాగర మప్రయత్నతన్
సరసభవత్కథామృతరసంబున మత్తుఁడనై తరించెదన్.

సీ. సర్వేశ కల్పాంతసమయంబునందు నీ యఖిలప్రపంచంబు నాహరించి
యనయంబు శేషసహాయుఁడవై శేషపర్యంకతలమునఁ బవ్వళించి
యోగనిద్రారతినుండి నాభీసింధుజస్వర్ణలోకకంజాతకర్ణి
కందు జతుర్ముఖు నమరఁ బుట్టించుచు రుచి నొప్పు బ్రహ్మస్వరూపివైన
గీ. నీకు మ్రొక్కెద నత్యంతనియమ మొప్ప
భవ్యచారిత్ర పంకజపత్ర నేత్ర
చిరశుభాకార నిత్యలక్ష్మీవిహార
యవ్యయానంద గోవింద హరి ముకుంద.

ఇట్లు పెద్దయుంబ్రొద్దు ధ్రువునిచే వినుతింపఁబడి భగవంతుండు భృత్యానురక్తుండై యింతింత నరాని సంతసమున

"వత్సా! నీధీరవ్రతమున కానంద మొందితి. బాలప్రాయమున సాధుజనదుర్లభం బగు నీయక్షీణదీక్షాచరణంబునకు నిరవధికభక్తిప్రభావంబునకు నచ్చెరువందితి. నీమనోభీప్సితమెఱింగితి. సప్తర్షిమండలము దారకాసమేతమై వలగొనం దగునట్టియు దురాపంబును ననన్యాధిష్ఠితంబును బ్రళయావసానంబునం దైన నశ్వరంబు గాక వెలుంగునదియు నైన ధ్రువక్షితి యనుపదం బిరువదియాఱు వేలేండ్లు చనినపిదప నీకుఁ బ్రాప్తంబు కాఁగలదు. అంతదనుక వనవాసగతుం డైన నీతండ్రిరాజ్యమును బూజ్యముగఁ బాలింపఁ గలవు. మృగయాకౌతుకంబున భవదనుజుం డగు నుత్తముఁడు ఘోరాటవులం గ్రుమ్మరి మృత్యుం డయ్యెడు. కుమారాన్వేషణార్థమై కాంతారములు పట్టి వానిమాతయు భీత్యావహం బగు వీతిహోత్రశిఖలచే రూపు మాయు. ఓయీ! ధ్రువకుమారా! న్యాయధర్మములం బెడబాయని రాజ్యపాలనంబున నిహసుఖంబులు దనివార ననుభవింపుము. యజ్ఞస్వరూపుండ నగు నన్ను సంపూర్ణదక్షిణలతోఁ గూడిన మఖంబు లొనరించి సంతుష్టునిఁ గావింపుము. చరమకాలంబున మదీయనామసంకీర్తనంబు చేసి పునరావృత్తిరహితం బగు శాంతిపదంబును బొందగలాఁడ" వని యభిమతార్థంబు లనుగ్రహించి ఖగవాహనుండు వైకుంఠంబునకుం జనియె.

అనంతర మానరేంద్రనందనుండు యమునాస్రవంతీప్రాంతకాంతారం బగు మధువనంబును వీడి నిజపురాభిముఖుం

డగుచు నాత్మగతంబున "అక్కటకటా! ఎంతలెంతలు వింతలు పుట్టె! నే నభిలషించు చున్నతపదంబువలన నాకనివాసులకు సంభవించు నంతరాయ మేపాటిది? వారిచేఁతలనే నామది కలుషితంబైనది. సనకసనందనాది యోగీంద్రబృందము జితేంద్రియత్వమునఁ బెక్కువేలేండ్లు యోగసమాధులఁ నిలిచి ముకుందచరణారవిందములఁ గాంచి తరియించు చుందురు. అట్టితఁడె నేను షణ్మాసంబుల వానియనుగ్రహంబు నకుఁ బాత్రుండ నయ్యు నిరర్థకంబులై యశ్వత్థంబు లగు నర్థంబుల నర్థించి వ్యర్థమనోరథుఁడ నైతి. బాపురే! నన్ను బోలు మూఢమానసులు ధాత్రిపై నుందు రోటు? పెక్కు లేల? నారదమునీంద్రులవాక్యసరణి తథ్యంబ యగు" నని తలపోయుచుండెను.

అవ్విధంబున స్వగృహాభిముఖుం డగు ధ్రువుని త్తే మో దంతము కర్ణరసాయనంబుగ నుత్తానపాదునకుఁ దెలియవచ్చె. కాని యాతఁడు కుమారశేఖరుఁడు మగుడి వచ్చుట చచ్చిన వారలు లేచి వచ్చుట వంటి దని తలంప సాగె. మందభాగ్యు నకు శుభప్రతిపాదన మెక్కువడి నొడఁగూడు నని వితర్కింపఁ బూనె. వెండియు మునివాక్యములు స్మరణకు వచ్చి యాశాం కూరములు తలనూప సాగె. తోడనే సుతునిరాక నివేదించిన మతిమంతున కతులితదివ్యభూషణాంబరశ్రేణి నొసంగి బంధు జనామాత్యపరివృతుండై తేఁ డెదురుసనియె. అవ్విధంబునఁ గొంతద వ్వేగుసరికి రమాకళత్రచరణారవిందయుగళార్చనా

పరుం డగు కుమారశేఖరుండు గన్నులకఱవు దీఱ సాక్షాత్క రించె. తొలఁకాడు ప్రేమభరంబున మేనఁ బులకాంకురంబులు మొలకెత్త రాజు సుతునిఁ బొదివిపట్టి మోము నివిరి శిరము మూర్కొని చుబుకంబు పుణికి యవ్యయానంద బాష్పధారల నభిషిక్తుం జేసి యాశీర్వదించె. అంతఁ జిరయశుం డగు ధ్రువుండు ప్రమోదితాత్ముం డగుచుఁ దండ్రికి బ్రణతు లొనరించె. వదంపడి తల్లులచరణాంబురుహంబులు ఫాలతలంబు సోఁక మ్రొక్కులిడి నిలిచినయక్కుమారవీరుని జేరఁదిగిచి సురుచి పూర్వవైరమును బాటింపక చిరంజీవివి కమ్మని దీవించె. మాత యగు సునీతి ప్రేమజలధి చెలియలికట్టను ద్రెంచుకొని పొంగిపొరలె. వార లెల్లఱుఁ గొంతతడవు సంతతానందమయ మగు ప్రేమరాజ్యమును బాలింప సాగిరి. పౌరజనాళి వీరమాత యగు సునీతిదేవిం గాంచి "తల్లీ! నీపూర్వభాగధేయము సుపుత్త్రరూపమున నేత్రపర్వం బొనరించుచున్నది. ప్రణతార్తిహరుం డగు నబ్జనాభుం డివ్విధంబున మీచేఁ బూజితుం డగుచున్నవాఁడు. ఇమ్మహాభక్తునికరంబున ధరామండలం బెల్ల డంబు మీఱఁ జిరకాలము రక్షితం బయ్యెడుఁ గావుత" మని దీవనలు వెట్టిరి. ధ్రువకుమారుండు భ్రాతృసహితుండై వారణేంద్రంబుపై నధివసించి నగరాభిగమనుం డయ్యె.

పురగోపురావళులును, కుడ్యద్వారవారములును స్వర్ణకాంతు లీనుచుండె. రంభాస్తంభములు పుష్పమంజరీకలితము

లై సంశోభించుచుండె. విపణిమార్గములు ఘనసారకస్తూరికా గంధజలబంధురంబులై రాణించుచుండె. గృహప్రాంగణములు నవరత్నమయరంగవల్లీవిరాజమానంబులై కర ముద్దీపించుచుండె. నగరోపకంఠమునందలి యుద్యానవనతరుచ్ఛాయల నాశ్రయించిన శుకపికమిథునాళి యవ్యక్తమధురగానములతో ధ్రువకుమారునకు సుస్వాగత మొసంగుచుండె. ధ్రువుండు రాజమార్గమున నిర్గమించుతఱి,

మ. హరిమధ్యల్ పురకామినీజనులు సౌధాగ్రంబులం దుండి భా
స్వరసిద్ధార్థఫలాక్షతప్రసవదూర్వావ్రాతదధ్యంబువుల్
కరవల్లీమణిహేమకంకణఝణత్కారంబు శోభిల్లఁ జ
ల్లిరి యాభాగవతోత్తమోత్తమునిపై లీలాప్రమేయంబుగన్.

ఉత్తానపాదుఁ డిట్లతివైభవంబునఁ గుమారునిం గూడి జగజ్జేగీయమానప్రభలతో విరాజిలు రాజసౌధంబు నింద్రుండమరావతిం బోలె నలంకరించె. ఇప్పగిదిఁ బురప్రవేశం బొనరించిన రాజర్షి యగు నుత్తానపాదుఁడు హర్షోత్కర్షంబులు మనంబున ఘనంబుగఁ బెనంగొన నక్కుమారతల్లజుని ప్రభావిభవాతిశయంబులు గనుంగొని నయనకహ్లారము లానంద మరందబిందుసందోహమ్ములఁ జెమ్మగిల్ల నుమ్మలికమ్ము మాని యవ్యయానందంబునఁ గాల మేగించుచుండె. ధ్రువకుమారుండును సర్వజనానందసంధాయియై నవనవోన్మేషయౌవనమునఁ బౌరజననయనచకోరములకుఁ బార్వణచంద్రబింబమై దీపించుచుండె. మాకుమారునికరణి రాణించునిజకుమారవరునిఁ గాంచి చిత్త

మున రేకెత్తినయానందమున నాతని సామ్రాజ్యాభిషిక్తుం జేసి యుత్తరవయఃకాలంబున శాంతచిత్తముతో నాత్మగతిం బొందఁ గృతనిశ్చయుఁడై వృద్ధభూపతి వానప్రస్థవృత్తి నవలంబించె.

రాజ్యలక్ష్మిని చేపట్టిననాఁటినుండియు ధ్రువుండు ప్రజల నాత్మప్రజలంబోలెఁ బోషించి పాలించుచు రూపొందిన ధర్మదేవత నాఁ బౌరజనాళిచే మన్ననల నందుచుండె. అనంతర మాధరాతలేంద్రుండు శింశుమారప్రజాపతికిఁ గూఁతురైన భ్రమి యనునారీమణిని బరిణయంబై దానివలన సంతాన ఫలముఁ బొందె. వెండియు వాయుపుత్రిక యైన ఇల యను కాంతాలలామను స్వీకరించి యుత్కలనామకుం డను నొక్క కుమారవరుని నసమానరూపలావణ్యాతిశయంబులఁ బరిఢవిల్లు నొక్కకన్యారత్నమును గాంచె. ధ్రువభ్రాతలేంద్రునిభ్రాత యగు నుత్తముఁడు వివాహయోగంబు లేకయే మృగయా వినోదార్థము హిమవన్నగ ప్రాంతకాంతారంబులఁ గ్రుమ్మరుచు నొక్క యక్షకులసంజాతునిచే నిహతుం డయ్యె. వానిమాత యగు సురుచియు నీవార్తచే నార్తిఁ గుందుచు వనవీథులం బడి పరిభ్రమించుచు దావపావకశిఖల కాహుతి యయ్యె.

ధ్రువుండు భ్రాతృమరణసంజనితశోకవ్యాకులచిత్తమున నుగ్రుండై బాణాసనము బాణితలమ్మున సంధించి జైత్రం బను రథం బెక్కి యుత్తరాభిముఖుండై చని హిమవద్ద్రోణియందు గుహ్యకవాసం బయినయలకాపురంబుఁ బొడఁగని యాపురోప

కంఠమున విడిసి మహోద్రేకంబున శంఖమును బూరించె. ఆశంఖారావము భయంకరధ్వానము లీనుచు దిగంతంబుల నిండి యక్షకాంతలగుండియలు వ్రీలం జేసె. యక్షభటాళి రిపుం డెవ్వఁడో తమపురిం దాఁకె నని సమరోత్సాహంబు సంధిల్ల వివిధాయుధోపేతులై యొక్కుమ్మడి వానిం జుట్టుముట్టిరి. అంత నమ్మహారథుం డగుధ్రువుండు దుర్నిరీక్షప్రతాపంబున విజృంభించి తన్నలమికొనిన పదుమూఁడువేలసేనాసముదయంబులఁ జీరికిం గొనక చిచ్చఱపిడుగట్లు నిశితశరపరంపరలఁ బిలుకుమార్చె. యక్షులందఱ అమ్మహోదారు పరాక్రమప్రకటధైర్యకరలాఘవంబును బలుమాఱు నుతించుచు రోషకషాయితాత్ములై హుమ్మని డీకొని వానిపై శరవర్షంబులు గురియించిరి. అత్తఱి నాతఁడు మబ్బులమాటున డాఁగు గుబ్బలివడువున నేమి చేయుటకుఁ దోఁపక పెంపఱియుండె. సిద్ధగణంబులు మింటం గంపించుచు హాహాకారంబు లెగయ ధ్రువపయోరుహాహితుండు దైత్యసమూహార్ణవమందు మునింగె నని చింతింప సాగిరి. ఆపోటుమానిసిం గెలిచితిమి గెలిచితి మని యక్షవీరు లెల్లరు నుల్లములం బెల్లుగ సంతసిల్లి గేలి యొనర్పం బూనిరి.

అంత ధ్రువుండు హిమకణంబులఁ దూలించు ప్రచండ మార్తాండునిభంగి చండకార్ముకమును జే సంధించి వివిధ నారాచపరంపరలచే నరిసేనను బింజపింజలుగఁ దూలించుచు ప్రభంజనుండు మేఘావళిం బాఱఁదోలుగతి యక్షసైన్యములఁ

జించి చెండాడఁ దొడంగె. ధ్రువునినిశితబాణఘాతములచే శాత్రవసైన్యనివహంబునఁ బెక్కండ్రు వికలాంగు లయిరి. మణిగణస్థగితకిరీటములతో నొప్పారు నొదలలతోడను, సము జ్జ్వలమణికంకణాదులచే విరాజమానం బగు భుజనికరము తోడను రణరంగము వీరమనోహరాకృతిం బూని రమ్యం బయి తనరారు చుండె. మణిగణదీపితం బగు రుధిరప్రవా హము వింతకాంతుల నీనుచు భూతసంతతులకు విం దొన రించుచుండె.

యక్షసైన్యనికాయంబున హతశేషులు సమరవిము ఖులై హరిరాజమును గాంచి పరుగిడు మదకరీంద్రబృందమట్లు పలాయితులు కాఁజొచ్చిరి. రాక్షసమాయలను గప్పియున్న ధ్రువుండు వారికార్యవిధాన మెఱుంగ నేరక సారథిం గని “సారథీ! యిబ్భూతలంబున మాయావులకృత్యము లెఱుంగ నెవ్వ రోపుదురు?” అని వచియించి తత్పురప్రవేశంబునకుఁ ద్వారపడునంత నప్పురవరంబులు గానరాకుండుటయు నాప్రయ త్నమును మాని కర్తవ్య మెఱుంగక కొండొకవడి చింతించు చుండె. అయ్యెడ మహాజలధిఘోషంబు ననుకరించుశబ్దం బొక్కటి యాతనికి శ్రవణగోచరం బయ్యె. మహావాయుసంజ నిత మైన రజఃపటలము కకుబంతమ్ముల నాశ్రయించె. గర్జా నినదంబు లగుజీమూతవ్రాతము నభోవీథిని భీకరాకారము దాల్చి విహరించుచుండె. ఇట్టివిచిత్రసంఘటనమునకుఁ గారణం బారయుచు నిలిచిన ధ్రువునిమీఁద రక్కసిమూఁకలు బోరన

మస్తిష్క పురీషమూత్రపలలంబుల మొత్తములు వియత్తలమ్ము నుండి గురిపింపఁ దొడంగిరి. కట్టెదుట మత్తగజవ్యాఘ్ర సమూహము లుగ్రమూర్తులఁ దాల్చి దీపించుచుండె. ఉద్భట తరంగానీకమునఁ దుఱంగలించుసముద్రంబును, గల్పాంత భీషణం బయినమహాహ్రదంబును ముందువెనుకల దూబూచు లాడుచున్నట్లుండె. ఇవ్విధంబున మాయావు లగుయక్షులచే నవిరళభయంకరంబు లగునసురమాయలు ధ్రువునిపట్లఁ బ్రసర్పి తము లగుచుండె.

ఇట్టి భయంకరవైచిత్ర్యములఁ దిలకించి దైత్య మాయావాగురను నిర్గమించుమార్గం బెద్ది యని చిత్తమునఁ దత్తరపడుచుండిన ధ్రువునిసమక్షమున మునినికాయము ప్రత్యక్షంబై "అనఘాత్మా! లోకపావనం బయిన యెవ్వాని దివ్యనామంబు నాకర్ణించి సంస్మరించినమాత్రంబున భక్తావ తంసములు దుస్తరం బైన మృత్యువు నేని సుఖవృత్తిం దరి యింప నోపుదురో, యెవ్వానిచిదాకారము సదా మముబోంట్ల యెదను దేదీప్యమానప్రభలతో నర్తనం బొనరించుచుం డునో, యట్టియీశ్వరుఁడు పరుఁడు భక్తజనార్తిహరుం డొక్క రుఁడె నీయార్తిం బరిమార్పఁ గలం" డని యుగ్గడించి నిజేచ్ఛం జనిరి. అక్కరణి నానతిచ్చిన మౌనివరులహితం బును మౌళిఁ దాలిచి కృతాచమనుండై ధ్రువుండు లక్ష్మీవిభుని పాదనలినమ్ముల స్మరియించి మహోగ్రం బగునారాయణా స్త్రంబు గార్ముకమున మంత్రపూర్వకంబుగ సంధించుచును,

విమలం బయిన వివేకోదయంబునం జేసి రాగాదికర్మములు సమయుభంగి గుహ్యకమాయాంధకారము దవ్వుదవ్వుల విరిసి పోయె. వెండియు,

మ. వరనారాయణబాణరాజనితదుర్వార ప్రభాహేమపుం
ఖరుచిస్ఫారమరాళరాజసితపక్షక్రూరధారారణ
చ్ఛురసాహస్రము లోలి భీషణవిపక్షశ్రేణిపై వ్రాలె భీ
కరరావంబునఁ గానఁ జొచ్చుశిఖిసంఘాతంబుచందంబునన్.

ఇత్తెఱంగున నిశితప్రదీప్తం బగుబాణపరంపరలచే వికలాంగు లయి వెతలొందు పుణ్యజనులు పృథుహేతిపాణులై భూరిభుజగప్రకరంబులు ఖగనాథునిం గాంచి యెదిర్చి పేర్చుచందమునఁ జిత్రరథుని నొక్కపెట్టునఁ జుట్టిముట్టిరి. యతఁడుపరివృతుం డగుధ్రువుండు భుజావిజృంభణమున సింహనాదం బొనరించుచుఁ జండతరకాండమండలమున శాత్రవనివహంబును శాంతిపదంబును బొందించుచుండె.

ఇవ్విధమునఁ జిత్రరథుం డగు ధ్రువునిచేఁ బరిమార్పఁబడుచుండిన నిరపరాధు లగుగుహ్యకులం జూచి యతనిపితామహుం డయినస్వాయంభువమనువు మునిగణపరివేష్టితుం డయి చనుదెంచి వానిచేఁ బూజితుండై ధ్రువు నుద్దేశించి "వత్సా! శాంతింపుము. శాంతింపుము. భ్రాతృమరణక్లేశసంజనితరోషకషాయితాత్ముండవై నిరపరాధు లయినవీరిని దోరింపఁ బూనితివి. భూతహింస గావించుట పశుప్రాయులగుదేహాభిమానులకుం జెల్లుఁ గాని సాధువర్తనులకుం దగదు.

శిశుప్రాయముననే సర్వభూతశ్రేణి నాత్మభావంబునఁ దలంచి
నిష్ఠాగరిష్ఠుండవై లోకారాధ్యుం డగుపరంధాముని సేవించి
కీర్తి నందినపరమభాగవతాగ్రేసరుఁడవు. భాగవతులచిత్తం
బులకుఁ గడుఁ గూర్చువాఁడవు. నీయట్టివాని కిట్టిబెట్టిదపు
గార్యములు సేయ సమకట్టుట సంభావ్యం బగునేఁత
కానోపదు. కార్యకారణసంఘాతరూపం బయిన విశ్వంబున
నీభ్రాతృమరణకారణం బేకతంబున నిర్ణయింపఁగలాఁడవు!
కర్మాధీనము లయిన భూతవ్రాతములు మహావాయువు ననుస
రించు రజఃపటలంబుచాడ్పున నస్వతంత్రంబులై యనువర్తించు
చుండు. జగత్కారణుం డగుకర్తసాక్షి యీ సృష్టిపాలన
విలయంబులం గర్త కానివాఁడునుం బలెఁ జూపట్టుచుండు.
తండ్రీ! ఈయక్షులు నిరపరాధులు. నిర్దోషులు. అవధ్యులు.
ఒక్కనికై పెక్కం డ్రిక్కతంబున నని మొనఁ ద్రుంగుట
భావ్యంబు కానేరదు. కుమారవీరా! ఇయ్యది మను
కులంబున కనుచితకర్తంబు. భగవానుఁ డనుగ్రహింపఁడు.
పంచాబ్దములనాఁ డీడుకోడెగాండ్రలోఁ బినతల్లియాడినమాట
లకుఁ దాళ నోడి జననీజనకుల వీడి కాననాంతరముల ఘోర
తపం బొనరించి లోకోత్తరం బయినయున్నతపదంబు నందిన
మహాభాగుఁడవు. నీకీమత్సరం బేల? వత్సా? సర్వాశుభహాని
యైన రోషంబు మాని రాగద్వేషంబులం దగులంబువీడి సర్వ
భూతావాసుండును, నానందతేజోమయుండును, నవ్యయుండు
నగు మాధవునియందుఁ జిత్తమును హత్తించి చిరకీర్తియుతుం

డవు గమ్ము. అనఘా! నీదుసోదరహంతకు లని మదిఁ దలంచి యక్షవారమును వధియించి ముక్కంటి కనుంగుసఖుం డయిన కుబేరునకు నపరాధం బొనరించితివి. కావున నీ వాయర్ధ విభుని నర్థించి సుప్రసన్నునిగఁ జేసికొను" మని వచియించి ధ్రువునిచే సత్కృతుండై స్వాయంభవుఁడు ఋషిగణయుక్తుం డై యాత్మీయధామమునకుం జనియె.

అంత నాధనదుఁడు యక్ష చారణ విద్యాధర దివిజగణ సేవ్యమానుం డయి రోషరహితుం డైన ధ్రువుని సమీపించి కృతాంజలియై "ఓహో! క్షత్రియకుమారా! భవదీయపితా మహుని యాదేశంబుకతంబున దుస్త్యజం బయిన విరోధం బుడిగితివి. అటు గావున నీయందు డెందము ముదం బందెడిని. సృష్టిస్థితిలయంబుల కనయము కాలమె కర్తయై వర్తించు చుండు. కావున నీయనుంగుభ్రాతను నిధనంబు నొందించిన వార లీయక్షవరులు కారు. మఱియు నీవే యకారణంబుగ నీపుణ్యజనానీకమును దునుమాడితి వనియు నోనాడఁ జనదు. ఈశ్వరవిలాసములనంతములు. మించినకార్యమునకై చింతిం చుట గతజలసేతుబంధనంబ యగు. అనంతామేయశక్తి యుతుం డగు జగదీశ్వరుని సేవింపుము. నిరంతరము నీకు మే లయ్యెడు. నీమానసమిళింద మంబుజనాభపాదారవింద మరందపానంబున మత్తిల్లి మధురగానం బొనరించుట నే నెఱుంగుదు. అట్లగుట నీమనోవాంఛితం బగువరంబు సఫలీ కృతం బయ్యెడు. కావున నెఱింగింపుము. అవశ్యంబనుగ్రహిం

చెద." అనవుఁడు రాజరాజుచేఁ బ్రేరితుం డయి భాగవతోత్తముం డగు ధ్రువుండు "ఏహరిస్మరణంబున నజ్ఞానతమఃపటలము విరియంబాఱునో, యట్టిహరిస్మరణంబు తిరంబుగ హృదయంబున నిలుచునట్లు ప్రసాదింపు" మని వేఁడికొనియె. అందుల కాకుబేరుం డట్టులె యయ్యెడుం గాక యని వరంబిడి యంతర్ధాన మొందె.

పిమ్మట ధ్రువుండు దేవగణసంస్తూయమానుం డయి నిజావాసమునకుం బోయి, మంగళస్వరూపుం డైన పురుషోత్తమునియందు బుద్ధి నిలిపి ధర్మనిరతిని సేవించుచు, దీనవత్సలుం డయి పౌరజనాళిని గన్నబిడ్డలక్రియ నాదరించుచు, మేదురంబుగ యశశ్చంద్రికావల్లరులు దిగంతంబుల నెల్ల నల్లుకొనునట్లిరువదియాఱువేలేండ్లు త్రివర్గసాధనంబుగ రాజ్యము బాలించి విశ్వం బెల్ల భగవన్మాయారచితం బగు చిత్రపటంబుగా నాత్మఁ దలపోయుచు,

చ. మనువిభుఁ డంత భృత్యజన మంత్రి పురోహిత బంధు మిత్ర నం
దన పశు విత్త రత్న వనితా గృహ రమ్యవిహారశైల వా
రినిధిపరీతభూతలహారిద్వీపముఖ్యపదార్థజాలముల్
ఘనమతిచే ననిత్యములుగాఁ దలపోసి విరక్తచిత్తుఁడై.

నిజనందనునకుఁ బట్టంబు గట్టి బదరికావనాంతరసీమకుఁ బయనం బయ్యె. అవ్విధంబునఁ బురంబు వెల్వడి బదరికాప్రాంతశైవలినీపుణ్యతీర్థమునఁ గ్రుంకులిడి పరిశుద్ధాంతఃకరణుండై పద్మాసనంబు వైచికొని, పవనుని బంధించి ముకుళితనేత్రుఁడై పద్మపత్రనేత్రుని భజియించుచుండె.

అవ్విధంబునఁ దపం బొనరించు రాజేంద్రుని సమక్షము నకు దివ్యప్రభలతో వెలుంగువిమానం బొక్కటి గంభీర ఘోషంబున వచ్చి నిలిచె. అందు సర్వలక్షణసంశోభితు లగు పురుషవరేణ్యు లిర్వు రుండిరి. కిరీటాంగదకుండలధారులై తులసీదామములతో విరాజిలు కౌమారవయస్కులఁ గాంచి విష్ణుదూతలుగా నెఱింగి ధ్రువుండు బద్ధాంజలియై వారిని నమ్ర భావమున సేవించె. పుష్కరనాభభక్తు లయిన యాసునంద నందులు సంప్రీతచిత్తులై మందస్మితవదనారవిందు లగుచు ధ్రువునిం గాంచి "ఓయీ! నరేంద్రచంద్రా! నీకు భద్రం బయ్యెడుఁ గావుత. ఆకర్ణింపుము. అయిదేండ్లనాఁడు మేధా నిధివై యుదాత్తతపోవ్రతనిష్ఠం బూని మధుసూదను నంత వానిని బరితృప్తుం జేసిన భక్తావతంసుఁడవు. అద్దేవదేవుఁడు నీయెడఁ బ్రసన్నచిత్తుండై నిన్నుఁ గొని తేరఁ బనుపగా వచ్చిన వారము. మాధవపదసాన్నిధ్యమునకు దయసేయుము. రాజా గ్రణీ! పరమభాగవతోత్తము లెద్దానిని మహోత్తమపదం బని సర్వదా భావించి నుతియించుచుందురో, దేనిని ప్రభా కర సుధాకర తారాగ్రంబులు వలగొనుచుండునో, యట్టివిష్ణు పదంబు కరంబు ముదం బొడఁగూర్చెడు రమ్ము. వైళంబ విమానారూఢుడవు గమ్ము." అని వచియించిరి.

అంతట ధ్రువుండు వారియాశీర్వాదములఁ గైకొని విమానంబునకుఁ బ్రదక్షిణార్చన లొనరించి హరిపార్షదు లయిన సునందనందులకు వందనంబులు చేసి హిరణ్మయరూప

మును ధరియించె. తోడనే సురదుందుభులు మ్రోఁగసాగె. కిన్నరకింపురుషాదులవీణాగానము సొంపు నింపుచుండె. విరుల మునురు గురియఁ దొడంగె. అట్టిశుభోత్కరం బగుపుణ్యావసరంబున ధ్రువక్షితీంద్రుఁడు త్రివిష్టపంబునకుఁ బోవువాఁడై మాతృదేవతను దలంచుకొని యామెను బాసి పోవ్వొల్లక యుల్లమునఁ బెల్లుగఁ జింతిల్ల దొరకొనియె. తద్విచారకారణం బెఱింగిన విష్ణుదూతలు వాని నవలోకించి వేఱొకవిమానంబు నధిరోహించి మునుముం దరుగుచుండిన తజ్జననిం జూపి ధ్రువునికుందు వాపిరి. ఆవింతచెయిదములఁ గాంచి ధ్రువుం డింతిం తనరానిసంతసమున మంతుకెక్కె. దేవతలు పుష్పవర్షము గురియించుచుండ మాతృవిమానముపిఱుంద విమానారూఢుం డయి చని చని గ్రహమండలంబును, లోకత్రయంబును, సప్తమునిమండలంబును క్రమంబున నుత్తరించి విష్ణుపరాయణుం డైన ధ్రువుం డవ్వలఁ దనరారు శ్రీహరిపదంబు నంది త్రిలోకచూడామణియై వెలుంగుచుండె.

అద్దిరా! పంచవర్షప్రాయమున నాత్మగౌరవమునకై వాదులాడినభూధవనందనుఁడు, మనోరథసంసిద్ధికై దారుణాటవులం గ్రుమ్మరి యుగ్రతపంబున నీశ్వరానుగ్రహంబు వడసిన బాలభక్తుఁడు, ధరామండలం బెల్లఁ గరాగ్రంబునఁ బాలించి యశము గాంచి మించిన రాజేంద్రమౌళి, అపవర్గప్రాప్తికై దేవవిమానము స్వాగతం బిడు సుముహూర్తమునఁ దల్లిపాదపద్మముల నుల్లమునఁ దలపోసి భజియించిన మాతృభక్తిపరా

యణుఁడు, పాతకలోకము నల్లములు చల్లవడఁ జేసిన సల్లలిత ప్రతాపచారిత్రుఁడు, ధ్రువుండు విద్యార్థిబృందమున కాదర్శప్రాయుఁడై యభిమతార్థముల ననుగ్రహించి యోముఁ గావుత! వెండియు నీధ్రువచరిత్రమును ద్వాదశిని, పద్మబాంధవవాసరమున, శ్రవణనక్షత్రమున, దినక్షయమునందు, సంక్రమణవ్యతీపాతములయందు భక్తిశ్రద్ధలతోఁ బఠియించిన గేస్తులనిస్తులతమఃపాశములు పటాపంచలై శుభం బొనఁగూడుఁ గావుత!

నారదుఁడు

భరతఖండమునఁ బౌరాణికమహాయుగమునందలిభాగవతకథామృతనిధిని మథియించినచోఁ జరితామృతములు విబుధుల కాస్వాదనంబుగఁ గ్రోల నబ్బఁగలవు. కకుబంతవిశ్రాంతకీర్తిశోభితు లగు పురాణపూరుషుల యత్యద్భుతవర్తనములఁ గన్నులారఁ గాంచి యానందించి తరించుభాగ్యము లేకపోయినను, పురాతనకవివతంసుల యపదానవిశేషంబువం జేసి యుదంచిత మగు వాఙ్మయప్రపంచమున సుసంచితములై తత్తన్మహిమంబులు నేఁటిపాఠకలోకమునకుఁ బ్రత్యక్షము లగుచున్నవి. వసంతాగమసమయమున బాలరసాలము నాశ్రయించి మృదుగాన మొనరించు గండుకోయిలచందమున, నమ్మహాభాగవతోత్తముల జీవితములఁ బెక్కురు కవిశిఖామణులు ముక్తకంఠములతోఁ బాడి ధన్యతఁ గాంచిరి. నవయుగారంభమునందలి భారతసంతానము తమభావ్యభివృద్ధికై పురాణయుగమును సందర్శించి యమ్మహనీయుల మహత్తరజీవితపరమావధుల గుర్తించి వర్తించుటయే శ్రేయోదాయకము. ఆజన్మప్రగాఢమై రూఢికెక్కిన భక్తిప్రభావమును విషమస్థితులయందు విస్పష్టముగఁ బ్రదర్శించి శుభ్రకీర్తి నందిన ప్రహ్లాదుని, నిఱుపేద యయ్యు నిశ్చలభక్తిపరాయణుఁడై భుక్తిముక్తుల నందినకుచేలుని, తన కపకారము సేయఁ బూనిన మునికుంజరుని దెస ద్వేషము వహింపక

సంతోషముతో భక్తియొనర్చి వాసి గాంచి మించినయంబరీషుని, క్రీడాసక్త మగు శిశుప్రాయమున నాత్మగౌరవమును వీడక భయంకరారణ్యప్రదేశములయందుఁ గ్రుమ్మరి నెమ్మనమ్మున నమ్మలికమ్ము వీడి హరిచరణమ్ము లాశ్రయించి యనన్యసాధ్యంబు లగువరంబులం బడసి నేఁటికిని గగనతలంబున న్నిలిచి భూతలమందలి లేఁతప్రాయంపుగుఱ్ఱల నీతిప్రవర్తనమునకు మార్గదర్శకుఁడైన ధ్రువక్షితీంద్రుని దత్తద్యశోగానమున బహూకరించిన పాఠకులు వేఱొక పవిత్రభాగవతాగ్రేసరుని విడువక కీర్తింపవలసి యున్నారు.

ఇమ్మహాభాగవతవతంసుని స్మరియింపని పురాణములు లేవు. పేర్కొనని గాథలు లేవు. తలంపని వాఙ్మయము లేదు. ఆతని పావనపాదపద్మములు మెట్టని ప్రదేశంబులు లేవు. ఆతఁడు ముల్లోకములను సూర్యదేవునిచాడ్పున సంచరించు. వాయుదేవునిక్రియ వర్తించు. ఛాయయై పురాణపూరుషుల వెన్నంటి నడచుచుండు. మఱియుఁ జిత్రవిచిత్రసంఘటనములకుఁ గారణభూతుఁడై చూపట్టుచుండు. ఒక్కత్రుటిలోఁ బర్వతాగ్రమున నిలిచి యక్షీణదీక్షతో నీశ్వరతత్త్వమును మననము సేయుచుండు. వేఱొక్కనిముసమున నవరత్నమయాంగదబాహువల్లరులతో మ్రొక్కులిడుభూపాలమౌళి మ్రోల వింతహొయలు దీపించుచుండు. మఱొక్కతఱి నాలుమగలయింటికయ్యములనడుమ నిలిచి యారాటములఁ బావుక్రియఁ బోరాటములకు నూతనపరిస్థితులు గల్పించుచుండు.

భూలోక భువర్లోక తపోలోకములు మున్నగు నూర్ధ్వలోకములును, అతల వితల రసాతలాద్యధోలోకములును నమ్మహాభాగునకుఁ గ్రీడారంగములు. ముప్పదిమూఁడుకోట్లవేల్పులును వానియనుగుఁదమ్ములకు దాసోహమ్మని మ్రొక్కుచు వాని నృత్తగీతములకుఁ జిత్తములు వికసింప సంతసించుచుందురు. ఆతఁడు జితేంద్రియుఁడు. నిత్యబ్రహ్మచారి.

విశాలఫాలభాగముతోఁ, బ్రఫుల్లనయనకల్హారములతోఁ, రుద్రాక్షమాలికావిరాజితం బగు కంబుకంధరముతోఁ, మేదురం బగు వీణానాదమున మేదినీతలమునఁ గ్రుమ్మరు నాభక్తివిశారదుఁడే నారదుఁడు. బ్రహ్మమానసపుత్త్రుఁడై కలియుగమును గూర్చిన యిరువదిరెండువేలగ్రంథ మగు నారదీయపురాణమునకుఁ గర్తయై పదునెనిమిదిపురాణములు నైకకంఠ్యమున ఘోషించి స్తుతియింప మించినఋషీంద్రునిభక్తిశీలము భారతవిద్యార్థుల పఠనీయగ్రంథములయందు మృగ్య మగుట కాలవైపరీత్యమే యన నగు. అమ్మహోదారచారిత్రుని 'జగడపుఁగూటిసత్తరు' వనియు 'తలకొట్లమారి' యనియు మాత్రమే గ్రహించిన బాలకమండలికి జాతీయతాప్రభూతశుభోదయదీప్తు లెక్కరణిఁ బొడసూప నేర్చు? నిర్జీవము లగు వ్యర్థగాథలతో నమూల్య మగు కాలధర్మమును వమ్ముసేయు విద్యార్థిపౌరుల హృదయవీథుల నున్నతాశయములకై వెదకులాడుట మరుమరీచికాసముదయమ్మున శుభ్రజలంబులకై యూటలూరెడు బాటసారులపరిపాటి కాక మానదు. అట్లగుటఁ

బాలకకిశోరముల భావియశస్సునకై యాశీస్సుల నిడు నీపావని చారిత్రమును శ్రద్ధాళువు లయి పఠియింపఁ గోరుచుఁ గథారంభమును జేయుచున్నారము.

తొల్లింటి మహాకల్పమున సౌందర్యమాధుర్యగాంభీర్యాదిగుణములచే సుందరనారీజనబృందమునకు నయనాభిరాముండై ఉపబర్హణుం డనుపేరం బరగు గంధర్వశ్రేష్ఠుం డొక్కరుండు గలఁడు. అతఁ డొక్కనాఁడు లోకనిర్మాత లగు ధాతలచేఁ దా నందఱను గూడి యొనరించు దేవసత్త్రమను యాగమున దివ్యమంగళగానముం బొనరుచుటకై యామంత్రితుం డయ్యె. గానవినోదములకై గంధర్వగణమును నప్సరోజనమును గడువడిం జనుచుండె. నిరంతరము స్త్రీజనసేవితుం డయి వినోదించు నుపబర్హణుఁడు గూడ వారిం గూడి యచ్చటికిం బోయె. విశ్వస్రష్టలచేఁ గావింపఁబడుచున్న జన్నము కన్నులపండువు సేయుచుండె. అచ్చరలేమలు విచ్చలవిడిం జేయు నృత్యగీతములతోడను, గాంధర్వకళావిశేషప్రదర్శనములతోడను నిబిడీకృతమై యాగవాటిక యాజ్యాదిహవిర్వినిర్గతసౌరభబహుళధూమపరీతవాతపోతముల సర్వజనహృదయానందసంధాయకమై తనరారుచుండె. అత్తఱి శ్రీహరికల్యాణగాథలను గీర్తించు నప్సరోగణనృత్యగీతంబులఁ బాల్గొనియు నొకించుక విముఖుఁడై వేఱొక్కచక్కిం జేరి యచ్చరమచ్చెకంటులతోఁ బచ్చవిల్తుని హెచ్చుపోడుముల నిచ్చమెచ్చు నుపబర్హణుఁడు విధాతలచూడ్కులం బడియె.

చేయునదియా దేవసత్త్రయాగము; యజమానులా బ్రహ్మలు; పాడ(బడునవియా దేవదేవుని యనంతలీలావిలాసములు. అట్టిపుణ్యావసరమున నీతిదూరులనేత లేరికి గోత పుట్టింపవు? తోడనే వారిజభవులనేత్రములు ప్రళయాగ్నికీలలవలెఁ జేవురించె. చిటచిటార్భటులతో విస్ఫులింగములు నయనగోళములనుండి రాలఁ దొడంగె. మనోహరప్రదర్శనము ముహూర్తమాత్రమున భీభత్సరంగముగ మాఱిపోయెం. తోడ్తోన కటంబు లదరఁ బటపటం బండ్లు గీటుచు వారు గంధర్వవీరునిం గాంచి "ఓయీ! గంధర్వకుమారా! నీ విటఁ బంకజాతాయతాక్షుని గూడి పాడ నేరక కామినీవారముతోడ విహరించుచుండిన కల్మషమున నష్టతేజుండ వగుచు ధారుణీతలమున శూద్రజాతిం జనియింపు" మని శపియించిరి. ఔరా! ఎంతమతిమంతునేని కాంతాననలోలత బలువంతల పాలు చేసి యధఃపతితునిఁ జేయక మానదు గదా!

అట్లు శాపవశమున నుపబర్హణుఁడు వేదవాదు లయిన యోగిజనులయింట నూడిగము సేయుదాసికడుపునఁ బసిపాపఁడై జననంబు నొందె. అక్కాంత బాలకుని ప్రేమభరమున నచిత్రరీతిని బోషించుచు లేఁబ్రాయముననే మునిజన సేవను నియోగించె. అయ్యది వానకాల మగుటఁ జాతుర్మాస్యంబున నేకస్థలనివాసము సేయ సంకల్పించుకొనిన జడదారులనడుమ నీబుడుతఁడు మెలఁగఁ దొడంగె. వారలసపర్యలయం దీబాలకుఁ డించుకయేని యేమరక యాటపాటలచేఁ

వీటిబుచ్చక భక్తిపాటవమున సమ్మహానీయుల సేవించుచు వార లొనరించు బ్రహ్మావాదముల వీనులవిందుగా వినుచుండె. మంగళప్రద మని భావించి వారియెంగిళులు ప్రీతిమెయి నారగించుచుండె. ఎండవానల సరకుగొనక వారిదండ నిలిచి భక్తిమై కనుసన్నల మెలంగుచుండె. వర్షకాలశరత్కాలము లతిక్రమించుదనుక నీబాలుఁడు వారల నియతితో సేవించు టంజేసి యుత్తపసివేల్పు లీయర్భకునియెడ నిర్భరకృపాంత రంగు లయిరి. అనంతరము వారు శ్రీకృష్ణభగవానుని దివ్య చారిత్రములఁ జదువుచు, వర్ణించుచు, గానము సేయుచు బ్రహ్మానందరసాబ్ధి నోలలాడుచుండిరి. మునీశ్వరులపాదచ్ఛా యల ననుసరించి వర్తించు నబ్బాలుఁడును శ్రీకృష్ణచరితామృ తమును వీనఁజేరల జుఱ్ఱుచుఁ దన్మహిమాతిశయము గుర్తె ఱింగి యన్యమును వీడి విష్ణుసేవనమే యిహపరసాధనం బని కృతనిశ్చయుఁ డయ్యె. దానంజేసి యప్పుడు యోగిజనం బుల యనుగ్రహంబునకుఁ బాత్రుండయ్యె. అక్కతనమున నిజ్జగ మంతయు మాయాపరికల్పిత మ్మనుజ్ఞానమును ప్రకృతిగుణాపరి హారిణి యగు హరిభక్తియుఁ బ్రభవించె. అంత నయ్యోగి జనములకు దీక్షావసానసమయము సమీపించుడు, యాత్రావ సరము నన్వేషించుచు నేయుపచారముల నెఱుంగక నిరంతర భక్తిపరీతచేతస్కుఁడై శ్రీహరిచరణసరోరుహమ్ముల సేవించు నాకుఱ్ఱనియెడ వారు సంప్రీతచిత్తులై యవ్యాజానురాగమున నీశ్వరతత్త్వమును సంపూర్ణంబుగ నుపదేశించి దేశాంత రంబు చనిరి.

అనంతర మబ్బాలకుండు వారియుపదేశము ననుస రించి వాసుదేవుని మాయానుభావమును దెలిసికొని ప్రణవ పూర్వకముగా మూర్తిశూన్యం డగు సమ్మంత్రమూర్తిని భక్తి మీఱఁ గీర్తించుచుండ, నాపోఁటిగానియుదారవృత్తి కిచ్చ మెచ్చి భక్తవత్సలుఁడు వానికి ధైర్యసాహసముల ననుగ్ర హించె. భిక్షుల సమక్షమునఁ బరిచర్య సేయుకాలమున వానిమాత యూడిగపుసేఁతలయందు దా ననుభవించు కష్ట నిష్ఠురముల నెన్నఁడును వానికిఁ జెప్పి యెఱుంగదు. తన పరా ధీనవృత్తిం గూర్చి వానిచెంగటఁ దలపోయదు. ఆఁకలిదప్పుల బాధలఁ జెప్పి వాపోవదు. తన్నేలినవారి మందిరమునఁ గల పనుల నన్నిటిని గ్రమంబునఁ దీర్చి యిలు సేరి పొంగారు ప్రేమభరంబునఁ గుమారుని జేరఁ జీరి యూరుభాగమునఁ జేర్చి చుంచు దువ్వి చుబుకంబు పుణికి శిరము మూర్కొని పుత్ర గాత్రపరిష్వంగమున నంగ ముప్పొంగఁ బెక్కువిధముల లాలించి పాలించుచుండు.

ఇవ్విధమున మాతృప్రేమకుఁ బాత్రుఁ డయిన యబ్బా లసపుత్రుఁడు తల్లిని విడనాడ నోడక నింటనుండియు మోహి గాక యెఱుక విడనాడక మాఱుచింత లేక మానియై కాల మేగించుచుండె. ఇట్లుండ నొకనాఁటివిభావరి నాతనిమాత సదనమును వీడి పాలు పిదుకుటకై వెడలుచుండునవసరమున

నాపిపాక మొకపాఁపతేనిపై మోపంబడియె. తోడ్తోన నామె భీకరవ్యాళవిషానలమహోగ్రజ్వాలాతతి కాహుతియై యిలాతలమునఁ గూలె. ప్రేమమూర్తి యైన మాతృదేవత తల్లడపాటుతోఁ బల్లటిల్లుచు నస్తంగత యగుట చూచి మాతృవియోగానల దంద్యమానహృదయుఁ డయ్యుఁ గొండొకవడికిఁ దెలిసికొని, తత్త్వజిజ్ఞాసు వగుటం జేసి మోహవశుఁడు గాక, మేలు సంధిల్లె నని యుల్లమునఁ దలపోసి యబ్బాలుఁడు వైష్ణవార్చనల కడ్డంకులు తీఱెఁగా యని మోదమున మిన్నుముట్టె. భక్తాగ్రగణ్యుల చరిత్రములు వింతలు గదా!

అనంతర మబ్బాలుం డచ్చోటు వాసి యుత్తరాభిముఖుఁడై చనిచని జనపదంబులు, నదీనదంబులు, పురంబులు, పట్టణంబులు, కిరాతపుళిందనికేతనంబులు, మృదులనిస్వనవిహంగవిహారమందిరము లైన సుందరసరోవరములు నతిక్రమించి యొక్క నదీహ్రదంబునఁ గ్రుంకులిడి శుచియై వార్చి భయంకరసత్త్వసముదయాక్రాంతకాంతారమధ్యమున, నవవేణుకీచకగుల్మలతాగహ్వరములపొంత, రావిమ్రానినీడ విశ్రమించి గురుముఖమునఁ దా విన్న చందమున డెందమునఁ బొందికతోఁ బరమాత్మస్వరూపమును ధ్యానింప దొరకొనియె. ఆనందాశ్రులు వెల్లివిరియ శ్రీపతిధ్యాననిమగ్నుఁడై

యున్న వానితలఁపునకు దేవదేవుఁడు ప్రత్యక్షమైనయట్లు దోఁచె. అయుత్తరక్షణముననే యబ్బాలకుఁ డానందాబ్ధి నిమగ్నుండై క్రమ్మఱ సద్దివ్యమంగళాకారమును గన్నులఁ జూడ వేఁడె. కాని కృతార్థుఁడు కాఁజాలఁ డయ్యె. అంతటఁ జేయునది లేక పులకితగాత్రుఁడై యాత్ర మందుచు నిర్జానుష్యం బయినకాననవీథులఁ బరిభ్రమించుచుండె.

అక్కరణి వనాంతరములఁ దిరుగాడువాని నుద్దేశించి వాఙ్మానసాతీతుం డగుశ్రీహరి గంభీరమధురభాషణముల "కుమారా! బేలవై యీలీల నేల శోషిల్లెదవు? ఎట్టులయిన నీ వీపుట్టువున నన్నుఁ జూడఁ జాలవు. కామాదిరిపుషడ్వర్గముల జయించి నిర్మూలితకర్ముఁడైన మునిముఖ్యుఁడే గాని కుయోగి నను గాంచఁ జాలఁడు. నీయార్తి హరించుటకై నా నిజమూర్తిని జూపితి. దీక్షమై నన్ను భజియించువాని దోషపుంజము లంటనేరవు. మత్సేవకతంబున నకుంఠితభక్తి యుదయించు. భయం బుడుగును. జన్మాంతరమునఁ గూడ మాయెడ వీడని గాఢతరభక్తి కుదిరి తిరుగాడుదువు. మాయనుమతినిం జేసి భక్తజనశేఖరుఁడవై యుదయింతువు. బాలకా! యీసృష్టియనంతరమున రాత్రి పోయినవెనుక నిర్దోషుఁడవై నిబాధస్మృతితోడ జనియించి శుద్ధసాత్వికాగ్రగణ్యుండవై గణుతి గాంచెదవు" అని వచియించి మిన్న

కుండె. ఇట్లన్నుహావాక్యము లాలించిన యనంతరమున నబ్బాలకుఁడు శిరము వంచి కరయుగళము మోడ్చి నమస్కరించి, శ్రీహరికరుణాంతరంగమున కాత్మ నుప్పొంగుచు, మదము దిగనాడి, మచ్చరముఁ బో విడిచి, కామక్రోధముల వర్జించి, పరమేశ్వరు ననంతనామములతోఁ గీర్తించుచుఁ, బరమభద్రములయిన తచ్చరితముల నిరంతరముఁ జంతించుచు, నిత్యనితాంత సంతుష్టస్వాంతుఁడై కాననాంతరముల వర్తించు చుండె.

ఇవ్విధంబున విషయవిరక్తచిత్తమునఁ గాలమునకై యాతఁడు నిరీక్షించుచుండఁ గొంతకాలమునకు మృత్యువు తనంతనె తటిచ్చలద్ధ్వాంతమున వాని సమీపించె. తోడనే యప్పాపఁడు పంచభూతాత్మకమును, గర్వసంభూతమును నైన పూర్వదేహమును వీడి హరికృపావశంబునఁ బరమభాగవత దేహమును ధరియించె. అంతట నాఖిలం బగు ప్రళయకాలము సమీపించె. త్రైలోక్యసంహారసంజనితాయాసవశంబునఁ బద్మగర్భుండు ప్రళయకాలపయోరాశిమధ్యమున శయనించి నిదుర వోవుచుండె. అవ్విధంబున నిదురించు బ్రహ్మనిశ్వాసము వెంట లోనఁ బ్రవేశించి సహస్రయుగపరిమితానంతరమున నప్పద్మగర్భుఁడు మగుడ మేల్కాంచి పునఃసృష్టికుద్యోగించునవసరమున నాతని యుచ్ఛ్వాసమువలన మరీచి

మున్నుగాఁ గల మునిముఖ్యులతోఁ బుట్టినయాతఁడే నారదుం డనుపేర బ్రహ్మమానసపుత్త్రుఁడై పరఁగె. ఇట్లుజనన మందినయాతఁ డఖండబ్రహ్మచర్యమును బూని, నారాయణ దేవుని యనుగ్రహాతిరేకమున మూఁడులోకముల బహిరంతర ములయందెందును నడ్డంకి లేక, బ్రహ్మాభివ్యంజకము లైన సప్తస్వరంబులు దమయంతన మ్రోయు మహతి యనువీణియ తోడుగాఁ బద్మనాభుని పవిత్త్రగాథలఁ బాడికొనుచు నిరతి శయానందకందళితహృదయారవిందుఁడై స్వైరగతిం దిరుగాడు చుండు.

సంసారాంబుధిని మునింగి కష్మవాంఛలచే దురంతవేద నలఁ బొంది గుందెడివారిని విష్ణునామసంకీర్తనము తెప్పవలె దరిసేర్పక మానదు. పూర్వభవమున గంధర్వశేఖరుఁడై, శాపవశమున శూద్రగర్భసంజాతుఁడై, మునికులసేవనమున విజ్ఞానఖనియై, పరమభాగవతోత్తమరూపము నొంది ముల్లోక ములును సంచార మొనరించు నీపూతచారిత్త్రుని కళ్యాణ గాథను నిరవధికభక్తిశ్రద్ధలతోఁ బఠియించు బాలకానీకము నకుఁ బరమాత్ముఁ డీప్సితార్థముల ననుగ్రహించి యోముఁ గావుత.

వెండియుఁ బ్రజానిర్మాణశక్తి యలవడుటకై తపం బొన రించు దక్షగర్భసంజాతులకు నివృత్తిమార్గమును బోధించి

దక్షుని యాగ్రహమునకుఁ బాత్రుఁడై నారదుఁడు స్థానభ్రష్టత్వమును బొందిి నాఁటినుండియు నిలువ నీడ లేక లోకసంచారము సేయుచుండె. దీని నాధారంబు చేసికొని కొందఱు కవిప్రకాండులు స్వవిరచితగ్రంథములయందు వలసినవిధమున సాక్షాత్కారము గావించుకొని యీపరమభాగవతాగ్రేసరునకు నీత్రికాలసంవేదికి నిర్హేతుకముగ నారోపించిన కలహశీలత్వమును జదువరులు గుర్తించి యీ మునిమహాశయుని శుభ్రకీర్తులనే కీర్తించి తరియించెదరు గాక.